# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 33 సంచిక 9
పేజీలు 40
మే 2014

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

భద్రవాక్యం .....................................2
శ్రీబాబూజీ ఉవాచ 3
పరీక్షిత్తు 5
సన్నిధిలో సంభాషణ 8
శ్రీమాతాజీ కార్యక్రమాలు 9
యోగవాశిష్ఠము 10
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు 12
ఆలు మగల పోరు 13
మానవుడి తప్పిదం 14
పరిప్రశ్నేన సేవయా 16
షోలాపూర్‌లో సత్సంగాలు 17
నీపేరేమో దేవుడట – నీ దయ ఉంటే చాలునట 19
భగవద్గీత – వర్తమాన సమాజం 20
శ్రీకృష్ణకర్ణామృతము 22
సత్యం శరణం గచ్ఛామి 24
పిబరే రామ రసం 26
ఆశ్రమ పాఠశాల 27
శ్రీ దత్తాత్రేయుడు–పరశురామ సంవాదం 30
సత్సంగామృతం 32
వైరాగ్యానికి చిహ్నం వైశాఖమాసం 34
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర 36
గురువు – శిష్యుడు 38
విష్ణు కథలు – 'రోహిదాసు' 39

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే ।
అతో నిర్విషయం నిత్యం మనః కార్యం ముముక్షుణా ॥
(అమృత బిందూపనిషత్ 3వ శ్లో॥)

సాధారణంగా విషయాలు లేకుండా జీవితం ఎలా గడుస్తుంది? అని అనుకుంటారు మానవులు. ఇటువంటివారికి మానవ జీవితం అంటే తినటం, త్రాగటం, నిదురించటం, ధనార్జన, కీర్తి ప్రతిష్ఠలు సాధించటం అనిమాత్రమే అనుకుంటారు. విషయాలను బాహ్యంగా కాకుండా సాధకుడు తన పాత్ర గురించి యోచన చేయాలి.



విషయాలంటే క్రియాత్మకమైనవి కావని, మనస్సులో విషపూరితమైన చింతన, భావన కార్యం చేయటం అని గ్రహించాలి. మోక్షాన్ని ఆపేక్షిస్తూ చింతనలో, భావనలో క్రియలో మనస్సు వక్రమార్గంలో దుర్వినియోగం చేస్తే సాధన ఎలా పురోగమిస్తుంది? అసంభవం.

దోషపూరితమైన ఆలోచనలను విడనాడాలి. అదే మనస్సు నిర్విషయపరచుకోవటమంటే. మనస్సు నిర్విషయమవ్వాలంటే ముందు అవగాహన, ఆ తరువాత కర్తవ్య నిర్వహణ, ఆచరణలో నీ ప్రయత్నం ప్రతిబింబించాలి. మనస్సు నిర్విషయమవటానికి బాహ్యజగత్తు అనుకూలించటం లేదు అన్న వాదన తప్పు. దానిని స్వానుభవంగా ఆసక్తితో జిజ్ఞాసతో, శ్రద్ధతో, విశ్వాసంతో సద్గురుమూర్తి సమాశ్రయంతో సాధించాలి.

మనస్సు సంస్కరింప బడటానికి శ్రవణం తోడ్పడుతుంది. శ్రవణం చేసిన దానిని పెడచెవిని పెడితే ఫలితం శూన్యం. మనస్సు నిర్విషయం అవ్వనిదే మనస్సు బంధ విముక్తి కలగదు. బంధము నుండి విడుదల చెందిన మనస్సే నిర్విషయమైన మనస్సు! అదే ముక్తి! అదే మోక్షము!

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ వారి విశ్రాంతి మందిరము నుండి వెలుపలికి వచ్చి అక్కడ వేచివున్న భక్తులందరికి దర్శనభాగ్యం కలగజేశారు. భక్తులంతా లేచి నిలుచున్నారు. శ్రీబాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "కూర్చోండయ్యా! నిలబడవలసింది బాహ్యేంద్రియాలతో కూడిన ఈ దేహము కాదు. మీ మనస్సు నిలబడాలి. పాపం మీ అందరి మనస్సు ఇక్కడ పెట్టివున్నా ఈ టి.వి.లో ఏ కార్యక్రమం వస్తుందాఅని ఆతృతతో ఉవ్విళ్లూరుతోంది కదా! చూశారా! దేహం విడిచి మనస్సు ఎలా సంచరిస్తోందో దానిని అదుపులోకి తెచ్చుకోవాలి. మనస్సుతో కూడిన వినయ విధేయతే భక్తి అని పిలువబడుతుంది.



దేహము నిర్వహించే ఏ క్రియ అయినా కర్మ అని పిలువబడుతుంది. ఇంతలో ఎవరో భక్తులు అందచేసిన ప్రసాదాన్ని అందరికి వినియోగం చేస్తూ తినండి. ఏమాత్రం భ్రాంతి వున్నా మొహమాటపడకండి. ఈ గురు ప్రసాదం దేవతలకు సహితం లభ్యం కానిది గుర్తుంచుకోండి. మీలో దేనిమీద భ్రాంతి వున్నా ఏ ఒక్క సంకల్పం మిగిలివున్నా ఏదైనా గుణం మిగిలివున్నా అవి పునర్జన్మకి దారితీస్తుంది సుమా! కాని ఈ గురుప్రసాదం భక్తిభావంతో, విశ్వాసంతో, తీసుకొంటే అది జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తుంది. మానవుడు అహంకార, మమకారాలను జయించ గలుగుతాడా?

అహంకారం శబ్దం ద్వారా జనిస్తుంది. కాబట్టి అహంకారానికి చెవి సంకేతం. కర్తృత్వ భావనే అహంకారాన్ని జనింపచేస్తుంది. ఇక్కడ మీకొక అహంకారాన్ని తెలియపరిచే వుదంతాన్ని చెపుతాను. చూడండి మన శర్మగారు రెండు యాపిల్ పండ్లు తీసుకొచ్చి నాకందచేసాడు, నేను ఇంత గొప్ప ఆఫీసర్ని కదా నాకు ఇంత పలుకుబడి, హోదా వుందికదా! నామాటని బాబుగారు కాదంటారా తప్పక నా కుమారునికి ఐ.ఏ.ఎస్ సీటు ఇప్పించకుండా వుంటారా! అనే ఉద్దేశ్యంతో ఇక్కడికి వచ్చారు. ఆయన మనస్సు ఆయనకి తెలుసు నాకు తెలుసు మీకు ఎలా తెలుస్తుంది? రెండు యాపిల్ పండ్లు ఇచ్చి ఐ.ఏ.ఎస్ డిగ్రీ కొట్టేద్దాం అనుకుంటున్నాడు. న్యాయనిర్ణేతలు మీరే చెప్పండి. ఇది భక్తి అనిపించుకొంటుందా! మీ

హృదయబాబు మీ భోగభాగ్యాలకు ధన, ధాన్యాలకు, ఎన్నడైనా లొంగుతాడా? మీ నిర్మలమైన మనస్సుకి దాసుడు. మీ హృదయంలోకలినమైన, పాషాణంతో సమానమైన భావాలు పెట్టుకొని అక్కడ విశ్రమించమంటె అది భగవానుడికి ఇచ్చే సముచితమైన స్థానమేనా? మెత్తని దూది వంటి నిర్మల హృదయం భగవానుడికి సరియైన స్థానమవుతుందికదా! కాబట్టి నేను ఇంత గొప్పవాడిని ప్రజ్ఞ నాది నన్ను ఎవరైనా గౌరవిస్తారు అనే భావన అహంకారానికి సంకేతం.

గరుత్మంతుడు సాక్షాత్తూ విష్ణుమూర్తికి వాహనంగా సేవలందించే పక్షిరాజు. ఆయనకూడా ప్రజ్ఞ నాది అనే అహంకారానికి దాసుడై పరాభవాన్ని పొందాడు. ఒక నాడు గరుత్మంతుడు ఆకాశయానం చేస్తుండగా ఆయన చెవికి ఒక సంభాషణ వినపడింది. ఆ సంభాషణతో ఆయనకు ఆతృత పెరిగి దాని వివరాలు తెలుసుకొన ప్రయత్నించాడు. అదే సమయంలో యమధర్మరాజు, చిత్రగుప్తుడు ఆకాశయానంలో చేస్తూన్న సంభాషణే గరుత్మంతుని ఆతృతకి కారణం అయ్యింది.

యమధర్మరాజు, చిత్రగుప్తునితో మాట్లాడుతూ భగవంతుని లీలలు విచిత్రంగా వుంటాయి సుమా! అదిగో అక్కడున్న పక్షి మరికొంత సేపటికి విచిత్రంగా ప్రాణాలు కోల్పోతుంది. ఆ కార్యం నిర్వహించవలసింది మనమే. అది ఎలా జరుగుతుందో వూహించ లేకుండా వున్నాను అని అంటూ వారు ఇద్దరూ నిష్క్రమించిన మరుక్షణం గరుత్మంతుడు అహంకార పూరితుడై ఈ పక్షి ప్రాణం ఎలా యమధర్మరాజు హరిస్తాడో అని అనుకుంటూ ఆ పక్షిని వెంటనే తీసుకొని పోయి కొన్ని వేల మైళ్ళదూరంలో అడవిలో ఒక చెట్టు చివరి కొమ్మపైన వుంచాడు. యమధర్మరాజు వూహకి అందని విషయం కూడా అదే. తను అనుకొన్న ప్రకారం అనుకొన్న సమయానికి ఆ పక్షి యొక్క ప్రాణములను హరించాడు. తాను ఏది అసాధ్యం అనుకున్నాడో దానికి గరుత్మంతుడు సహాయపడినట్లు అయ్యింది అదే భగవంతుడి లీల.

నేను ప్రజ్ఞావంతుడిని, పక్షిరాజును అనుకొన్న గరుత్మంతునికి గర్వభంగమై ఆయనలో జనించిన అహంకారం రహితం అయినది. అది యమధర్మరాజు విధి నిర్వహణకు సహాయపడింది. కాబట్టి నేను ప్రజ్ఞావంతుడను అనే కర్తృత్వ భావనే అహంకారానికి హేతువు. అది రహితం కావాలి అంటే గురుబోధా శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన బోధను మననం చేయాలి. అప్పుడే మనస్సులోని అహంకారం రహితం అవుతుంది.

*

# అమ్మమాట

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

## ఏడు రోజులలో తరించిన పరీక్షిత్తు

పరీక్షిన్మహారాజు, తనకు మరి ఏడురోజులలో మరణం రాబోతున్నదని తెలిసి ఏవిధంగా మనస్సును భాగవత కథ యందు నిలుపగలిగాడు? 'సన్న్యస్య శ్రవణం కుర్యాత్' అని శాస్త్ర వాక్యం. దానిని అక్షరాలా పాటించాడాయన. సన్న్యాసం దేనికి రావాలి? మనస్సు సన్న్యసించాలి. తన మనస్సు నుండి ప్రాపంచిక విషయాలన్నిటినీ తరిమి కొట్టగలిగాడు. 'యోగాశ్చిత్తవృత్తి నిరోధకః' అన్న సూత్ర ప్రకారం చిత్త వృత్తులన్నిటినీ నిరోధించి, భగవంతుని యందే విశ్చలంగా నిలిపాడు. రాత్రింబవళ్ళుగాని, ఆకలి దప్పులుగాని నిద్రగాని వీటి వేటికి అక్కడ స్థానం లేదు. శ్రీశుకులవారు చెబుతున్నారు; పరీక్షిత్తు వింటున్నాడు.



ఇక్కడ మనకొక ప్రశ్న ఉదయిస్తుంది. భాగవత కథలు మనం ఎందుకు వినాలి? అని. మనం మరచిపోయాం కాబట్టి మళ్ళీ మళ్ళీ వినాలి. జీవితం ఉండగానే భగవంతుని పట్ట దొరికింది పరీక్షిత్తుకి. ఆయనని బోధతో పట్టుకున్నాడు. బాధని నివారించుకున్నాడు. షట్చక్రాలనీ దాటాడు. సహస్రారంలోని గురు పరమాత్మతో హాయిగా బ్రహ్మానందాన్ని అనుభవించాడు.

"నామస్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే" - కలికాలం రాబోతున్నదని తెలిసే, మహాత్ములు మనకాబోధను అందించారు. భవ సాగరాన్ని దాటటానికి నామ స్మరణను మించిన అన్య ఉపాయం లేదన్నారు. కేశవకీర్తన చాలన్నారు. మరపు రాకుండా చేసే స్మరణే స్మరణ. నీవు ఏమి చేస్తున్నా నిన్ను నువ్వు ఎలా మరచిపోకుండా ఉన్నావో, అదే విధంగా, 'ఇవాళ నేను నిద్ర లేచాను' అంటే అది భగవంతుడి దయ; ఈ పని యిలా చేస్తున్నాను అంటే అది

ఆయన వల్లనే' అనే ఎరుక కలిగి వుండాలి. అనుక్షణం మారియిపోయే యీ సృష్టిలో, మార్పు లేనటువంటి వస్తువు కేవలం భగవంతుడు ఒక్కడే.

శ్రవణం పరీక్షిత్తులా చేయాలి. ప్రశ్న ఉండాలి. 'అసలు నేనెందుకు పుట్టాను? నా యీ జన్మకి కారణం ఏమిటి? నేను చేసిన కర్మలే నా జన్మకి కారణం. కనుక, విషయ దృష్టిని వదిలి, భగవంతుని యందే దృష్టి నిలుపుతాను' అనే దృఢ నిశ్చయం కలిగి ఉండాలి. ఎప్పుడూ ప్రపంచ విషయాదుల మీదనే ఉండే దృష్టి నీచ దృష్టి. ఇది మూలాధారం. దీనిని అధిగమించాలి. గ్రద్ద దృష్టి. గ్రద్ద ఎక్కడో ఆకాశంలో ఎగిరినా దాని దృష్టి ఎప్పుడూ నీచమైన శవాలమీదనే వుంటుంది.

ఇక 'చీమ దృష్టి' అంటే ఎమిటో చూద్దాం. ఒక ఇసుక గుట్టలో వదిలేసినా చీమ అందులో ఎక్కడైనా పంచదార కణిక దొరికితే, దానినే పట్టుకుంటుంది. అదే విధంగా సాధకుడైన భక్తుడు ప్రపంచంలోనే వున్నా, భగవత్తత్వమనే మధురం కోసమే వెదకి, దానినే పట్టుకుంటాడు.

దీనికే శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్ ఒక భక్తుణ్ణి చూసి, "నువ్వు యిసుక తక్కెడవయ్యా!" అని, మరొక భక్తుణ్ణి "నువ్వు పేడతక్కెడవయ్యా!" అని అన్నప్పుడు అందరూ నవ్వేవారు కాని, 'ఇసుక తక్కెడ' అంటే ఏమిటో ఆవిధంగా చెప్పి, 'పేడ తక్కెడ' అంటే యీ విధంగా వివరించారు - మలిన భూయిష్టమైన పేడలోనే పరమ పవిత్రమైన 'విభూతి' అనే తెల్లని, స్వచ్ఛమైన పదార్థం దాగిఉంది. అది బయటపడాలి అంటే పేడని పంచామృతాలతోనూ, నదీజలాలలతోనూ నమకచమకాలు చదువుతూ అభిషేకించినా, బయటపడదు సరికదా, వాటిని కూడా కలుషితం చేస్తుంది. పేడని అగ్నికి శుద్ధి చేస్తేగాని, దానిలో దాగి ఉన్న విభూతి బయట పడదు. అదే విధంగా విషయాదులతో కలుషితమైన, పేడవంటి మనస్సును 'ధ్యానాగ్ని'కి గురిచేస్తే, మనస్సులోనే దాగి ఉన్న స్వచ్ఛమైన, శుద్ధమైన పరమాత్మ వస్తువు మనకి అవగతమవుతుంది. అటువంటి సాధన చేస్తున్నాడు కాబట్టి, యితడిని 'పేడతక్కెడ' అని నేనన్నాను. దానికి మీరు విపరీతార్థాలు తీశారు" అని మాకు వివరించారు.

"ప్రొద్దుటే ఇడ్లీలను ముంచుకొని తినిన సాంబారు వాసనే మీ చేతులని వదలదే! మరి జన్మాంతర వాసనలెలా వదులుతాయి?"

అనేవారు శ్రీబాబు. దానికి కూడా ఉపాయం ఆ మహాత్ములే శెలవిచ్చారు. "వాసుదేవ స్మరణ చేస్తే వాసనలన్నీ హరిస్తాయి; వాసనలు హరిస్తేనే వాసుదేవ దర్శనం అవుతుంది" అని.

ఈ సూత్రాలన్నీ పరీక్షిన్మహరాజు అక్షరాలా ఆచరణలో పెట్టాడు. తనలోని విషయ వాసనలన్నీ ధ్యానాగ్నిలో దగ్ధం చేసుకున్నాడు. ప్రపంచం లోనే ఉన్నా, ప్రపంచాతీతమైన, ప్రపంచాధారమైన పరమాత్మ వస్తువునే అంతటా వెతికి దానినే ఆశ్రయించాడు. మూలాధారంలోనే దాగిఉన్న కుండలినీ శక్తిని అధోముఖంగా పోనీయక, ఊర్ధ్వగామిని చేసి, సహస్రారానికి చేరుకున్నాడు. తనని ఏ శస్త్రమూ ఛేదించలేదు; ఏ అగ్నీ దహించలేదు; నీరు తడుపలేదు; గాలి ఎండింపలేదు - అని తెలుసు కున్నాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అన్న గీతా వాక్యాన్ని అక్షరాలా ఆచరించాడు. అమృతత్వాన్ని పొందాడు పరీక్షిత్తు.

అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అకుంఠిత దీక్షా ధైర్యాలను, భగవన్నామ రసాస్వాదనను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనని రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!



ముషిణి చెట్టు, వేపచెట్టు వంటివి ఎంత చేదు గలవైననూ దాని వ్రేళ్ళతో కూడా ప్రజలకు ఔషధముగా ఉపయోగపడును.

కాని కఠిన హృదయుడైన నీచుడు ఎందులకూ పనికిరాడు. అనగా దయలేని వాడు ఎందుకూ కొరగాడని భావము

(వేమన శతకము/27 పద్యము)

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

16-12-85

శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "శ్రీకృష్ణ పరమాత్మునికి గోపకాంతలంటే ఎందుకు అత్యంత ప్రేమ? అలాగే గోపకాంతలు కూడ కృష్ణ పరమాత్ముని ఎడబాటుని సహించలేకపోయేవారు. ఇది జన్మజన్మల సంబంధం 'పుంసా మోహన రూపాయ' అని చెప్పబడిన శ్రీరామచంద్రుడు ఆజానుబాహుడు. బహు సుందరరూపము. మహర్షులకు సహితము ఆయన సుందర రూపము చూడగానే ఆలింగనము చేసుకోవాలనే మోహము కలిగింది. ఆ మహర్షులకు కలిగిన కోర్కెను తీర్చటానికే అన్నట్లుగా ద్వాపర యుగంలో తాను శ్రీకృష్ణ పరమాత్ముడుగా అవతరించి ఆ మహర్షులందరిని గోపకాంతలుగా ఉద్భవింప జేసి వారిని మురిపించి ఆనందింపచేశాడు.



భక్తునికి భగవంతునికి గల సంబంధం భగవానుడికే తెలియాలి గాని జీవుడికి ఏం తెలుస్తుంది? గోపకన్యలు శ్రీకృష్ణ పరమాత్ముని ఎడబాటుని సహించలేక పోయేవారు. శ్రీకృష్ణుడు అల్లరి పిల్లవాడు. అందుచేత వ్రేపల్లె వాసులంతా తమ కన్యలందరిని ఇంట్లోనే బంధించారు. ఈ చిక్కుముడిని విప్పటం భగవానుడికి ఏమాత్రం కష్టం చెప్పండి?

కృష్ణ పరమాత్ముడు వరుణ దేవుడికి ఒక వార్నింగ్ ఇచ్చాడు. వ్రేపల్లె వాడలో వర్షం కురవటానికి వీలులేదన్నాడు. వ్రేపల్లెలో నీరులేక కరువు ఏర్పడింది. పెద్దలంతా చేరి ఏం చేస్తే ఈ దుస్థితి నుంచి రక్షణ కలుగుతుందో ఆలోచించారు. శ్రీకృష్ణ పరమాత్ముని సలహా మేరకు గ్రామపెద్దలు, పురోహితులు, పండితులు అంతా కలిసి గోపకన్యలతో కాత్యాయని వ్రతాన్ని చేయించటానికి నిర్ణయించారు. చూశారా! విధి నిర్ణయాన్ని ఎవరు తప్పించగలుగుతారు?

వ్రేపల్లె వాసులకి వరుణదేవుని కటాక్షం కావాలి. కాని వ్రతం ఆచరించే గోపకాంతలకు మాత్రం కృష్ణ పరమాత్ముని కృపావర్షం తమపై కురవాలి అనేది వారి కోరిక. ఎవరికి కావలసింది వారికి లభించింది.

భగవానుడు ప్రేమమూర్తి. ఎవరు ఏది కోరుకుంటే దానిని ప్రసాదిస్తాడు.

కాత్యాయని వ్రతం పూర్తయింది. గోపకాంతలు కృష్ణుని కృపావర్షాన్ని అందుకున్నారు. వ్రేపల్లె వాసులకి శ్రీకృష్ణ పరమాత్ముని ప్రేమ వరుణదేవుని ద్వారా లభించింది. వర్షాలు కురిశాయి. పంటలు పండాయి. వ్రేపల్లె వాడ పాడిపంటలతో కళకళలాడింది. భగవంతుని ఆశ్రయించిన వాడికి ఎన్నడైనా లోటు ఉంటుందా? పోనీ మీలో ఎవరికైనా లోటు ఉందా చెప్పండి" అని ప్రశ్నించారు శ్రీబాబు.

# శ్రీ మాతాజీ కార్యక్రమాలు

1) 5-5-2014 నుండి 23-5-2014 వరకు భక్తులతో కలసి ఉత్తరదేశ యాత్ర.

2) 26-5-2014 నుండి 31-5-2014 వరకు పావులూరు శాఖలో (ఇంకొల్లు మండలం, ప్రకాశం జిల్లా) శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి నవ త్రింశతి (39వ) పుణ్యారాధన మహోత్సవములు, సత్సంగ సమావేశములు, అఖండ హరినామ సంకీర్తన.

3) కెనడా, అమెరికా పర్యటన -

జూన్ 7 నుండి 13 వరకు - కేలగరీ, కెనడా.

జూన్ 14 నుండి 20 వరకు - చికాగో, షాంపైన్.

జూన్ 21 నుండి 27 వరకు - సెయింట్ లూయిస్.

జూన్ 28 నుండి జులై 7 వరకు - మినియా పోలిస్

జులై 4 నుండి 6 వరకు సత్సంగములు జరుగు ప్రదేశము -

E.V.N. Kishore kumar
10178, Indigo Dr., Eden Prairie,
Minnesota-55347
Mobile NOs. Kishore - (573) 356 3723
Rajani - (732) 877 8516

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

"ఓ ప్రభూ!  మా ప్రభువు యీ అశ్వాన్ని మీకు కానుకగా యివ్వమన్నారు" అని చెప్పాడు. వెంటనే ఇంద్రజాలకుడు రాజుగార్ని అశ్వాన్ని అధిరోహించి, వినోదంగా స్వారీ చేయమన్నాడు. రాజుగారు తీక్షణంగా, ఆ గుఱ్ఱాన్ని చూడగానే రెండు గంటలసేపు తన ఉనికిని మరచి పోయాడు. ఒక విచిత్రమైన, అనూహ్యమైనమైకం కమ్మింది. అది ఒక సమాధిస్థితి లాంటిది. రెండు గంటల తరువాత బిగుసుకు పోయిన శరీరం, మామూలు స్థితికి రావటము ప్రారంభించింది. కొంత సమయం తర్వాత రాజుగారు సింహాసనము పైనుండి క్రింద పడ్డారు. అక్కడ సభికులు రాజుగారి శరీరాన్ని లేవనెత్తారు. అప్పుడు రాజుగారు తిరిగి స్పృహలోకి వచ్చారు.



అక్కడున్న మంత్రులు, సభికులు చాలా ఆదుర్దాతో యిలా ప్రశ్నించారు. "మీ కేమయింది ప్రభూ !"  అప్పుడు రాజుగారిలా సమాధానం చెప్పారు. "ఒక సిద్ధుడు నాముందు నెమలి యీకల గుత్తితో తయారు చేసిన చామరాన్ని వీచసాగాడు. వెంటనే ఒక గుఱ్ఱం నాముందు ప్రత్యక్షమైనది. నేనా గుఱ్ఱాన్ని యెక్కి, మండుటెండలో ఎడారిలో స్వారీ చేయటము ప్రారంభించాను. కొంత సేపటికి ఎండ వేడిమికి, నా నాలుక పిడచకట్టి పోయింది. నేను చాలా అలసి పోయాను. అప్పుడొక అందమైన అడవిలో ప్రవేశించాను.

గుఱ్ఱంపై స్వారీ చేస్తుండగా, ఒక తీగ నా మెడకు చుట్టుకు పోయింది. అశ్వము పారిపోయింది. ఆ గాఢ నిశీథిలో తీగ మెడకు చుట్టుకొని ఉండగా, గాలిలో అటూ, యిటూ వూగాను. భయంకరమైన చలితో వణుకు పుట్టింది. తరువాత సూర్యోదయమై, చక్కని వెలుతురు వచ్చింది. నేను నామెడకు చుట్టుకొన్న తీగను తృంచి వేశాను. అప్పుడొక అంటరాని జాతి అమ్మాయి, తనచేతితో ఆహారము, నీరు తీసుకపోవటం, గమనించాను. నాకు చాలా ఆకలిగావుంది, కొంచెము ఆహారమివ్వమని బ్రతిమిలాడాను. కాని ఆమె

నిరాకరించింది. నేను చాలాసేపు ఆ అమ్మాయి వెంటనడుస్తూ, వెళ్ళాను. అప్పుడా అమ్మాయి వెను తిరిగి యిలా అన్నది. " నేను చండాల కన్యను నీవు నన్ను వివాహమాడుతానని వాగ్దానం చేసి, నాతల్లి దండ్రుల అనుమతిని పొంది, మాతోనే వుండాలి. అలా వాగ్దానంచేస్తే, నా చేతిలో ఉన్న ఆహారాన్ని మీకు యిస్తాను" ఆకలి మంటకు తాళలేక నేనామెను వివాహము చేసుకొంటానని, వాగ్దానము చేశాను. అప్పుడామె తన దగ్గరవున్న ఆహారములో సగమాహారాన్ని యిచ్చింది. జంబూఫలముతో తయారుచేసిన పానీయాన్ని త్రాగాను.

తరువాత ఆమె నన్ను తన తండ్రి వద్దకు తీసుకు వెళ్ళి, వివాహ మాడటానికతని అనుమతి కోరింది. ఆయన అంగీకరించాడు. అప్పుడామె నన్ను తన యింటికి తీసుకు వెళ్ళింది. ఆ అమ్మాయి తండ్రి మాంసము కొరకు కోతులను, కాకులను, పందులను చంపి, ఆ జంతువుల చర్మాన్ని, వాటి నరాలపై యెండ పెట్టాడు. అక్కడ ఒక చిన్న కుటీరాన్ని నిర్మించి, నన్నొక అరటాకుపై కూర్చుండపెట్టారు. అప్పుడు మామెల్లకంటి అత్తగారు నా వంక చూచి, రక్త సిక్తమైన తన ఎర్రని కనుగుడ్లను తిప్పుతూ, యిలా అన్నది. 'ఇతనా! నాబోయే అల్లుడు' అంటూ పెదవి విరచింది.

చాలా సంబరముతో, వివాహవేడుకలు ప్రారంభమైనవి. మామామ గారు నాకు నూతన వస్త్రాలను, మరికొన్ని వస్తువుల నిచ్చారు. కల్లు, మాంసము విచ్చల విడిగా పంచి పెట్టారు. మాంసాహారులైన ఆ ఛండాలురు వావి డప్పులను మోగించారు. ఆమెతో నా వివాహమయినది. నాకు వారు పుష్ట యనే పేరుపెట్టారు. వివాహవేడుకలు ఏడు రోజులు జరిగాయి. మా వివాహబంధము వలన ముందొక పుత్రిక జన్మించింది. తరువాత మూడు సంవత్సరాల కొక నల్లని పుత్రుడు కలిగాడు. తరువాత నొక అమ్మాయి ఇలా వంశాభివృద్ధిచెంది, నేనొక వృద్ధ చెండాలుడనయి, పెద్ద కుటుంబముతో చాలా కాలము జీవించాను. సంతానము దుఃఖహేతువైనారు. మానవుల కష్టాలు, బాధలు కామజనితమై, సంతాన రూపంగా పరిణమిస్తుంది.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

మే 2014

2 శుక్ర : అక్షయ తదియ - శ్రీసద్గురుపాదపూజ

4 ఆది : శ్రీశంకరాచార్య జయంతి; శ్రీసద్గురు ఏకోనవింశతి19వ, వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము - శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

14 బుధ : వైశాఖ పూర్ణిమ - (బుద్ధ జయంతి) శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన

19 సోమ : శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక ప్రతిష్ఠా కళ్యాణ మహోత్సవము.

23 శుక్ర : శ్రీగురుదశమి; హనుమజ్జయంతి- సత్సంగం ; శ్రీసద్గురుపాదపూజ

27 మంగళ : మాసశివరాత్రి

28 బుధ : అమావాస్య

జూన్ 2014

7 శని : శ్రీసుగుణ ప్రసాదమాతాజీవారి సప్తమ వార్షిక పుణ్యారాధన.

13 శుక్ర : పూర్ణిమ శ్రీ సద్గురుపాద పూజ.

22 ఆది : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

25 బుధ : మాసశివరాత్రి

27 శుక్ర : అమావాస్య

**ఓ కృష్ణా! పరులను యాచించుట చులకనకు హేతువని మానవులు గుర్తించుటకు నీవు ఒక గుజ్జు రూపుదాల్చి, బలిని మూడు అడుగుల నేలను వేడితివి కదా!**

(కృష్ణశతకము/83)

# ఆలు మగల పోరు

- రమణ ప్రసాద్

(శ్రీమాతాజీ చెప్పిన హాస్య కథ)

"మన ఇంటిని మనమే చక్కబెట్టుకోవాలి. మీ సమయాన్ని ధ్యానంలో గడిపితే చాలా మంచిది అని శ్రీగురుదేవులు చెప్పేవారు. అయితే మనం బయట విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం యిస్తున్నాము. ఆశకు లోబడినవాడు జ్ఞానమనే రత్నం దొంగిలింపబడుతోంది అని తెలుసుకోలేక పోతున్నాడు. 'ఆశయా భధ్యతే లోకే కర్మణా బహుచింతయా । జ్ఞాన రత్నాప హారాయ తస్మాత్ జాగ్రత జాగ్రత' ।

ఒక గొల్లవానికి కొన్ని జొన్న కంకులు దొరికాయి. అవి తెచ్చి, భార్యకు యిచ్చి, రొట్టెలు చేయమన్నాడు. అతనికి నలుగురు కొడుకులు. కాని ఆ సమయంలో యింట్లో లేరు. ఆయన భార్య కంకులను శుభ్రం చేసి, పిండి విసిరి రొట్టెలు చేసింది. ఐదు రొట్టెలు తయారయ్యాయి. 'నేను కష్టపడి కంకులు తెచ్చాను. పైగా యింటి యజమానిని కాబట్టి నాకు మూడు రొట్టెలు, నీకు రెండు రొట్టెలు' అన్నాడు భర్త. 'కంకులు తెస్తే సరిపోతుందా? నేను కష్టపడి వాటిని శుభ్రంచేసి విసిరి రొట్టె తయారు చేసేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. కాబట్టి నాకు మూడు రొట్టెలు, నీకు రెండు' అన్నది భార్య. ఇలా వాదించుకున్నారిద్దరూ. ఇద్దరి మధ్య రాజీ కుదరలేదు. 'సరే ఇవాళ రాత్రి మనమిద్దరం కదలకుండా పడుకుందాం. ఎవరు కదలకుండా ఉంటే వారికి మూడు రొట్టెలు' అని ఒప్పందం చేసుకున్నారు.

తెల్లవారింది. భార్యభర్తలిద్దరూ లేవలేదు. పడుకునే ఉన్నారు. పిలిస్తే పలకలేదు చుట్టుపక్కవారు వచ్చిచూసి వారిద్దరూ మరణించారని నిర్ధారించి, పాడె కూడా కట్టి అన్ని ఏర్పాట్లుచేశారు. అయినా వారు మాట్లాడ లేదు. శ్మశానానికి తీసుకు వెళ్ళారు. చితికి నిప్పు అంటించారు. ఆ వేడికి భార్యలో కదలికలు వచ్చాయి. భర్త వెంటనే లేచి, 'నాకు మూడు నీకు రెండు' అన్నాడు. ఆ సమయంలో అక్కడ వారి నలుగురు కొడుకులు, మరొక వ్యక్తి మొత్తం ఐదుగురు ఉన్నారు. వారు యీ మాటలు విని హడలిపోయారు. వీరు దయ్యాలై మనలను వాటాలు వేసుకు తింటారు. అని పలాయనం చిత్తగించారు. ఆ భార్యాభర్తలిద్దరూ నాకు మూడు నీకు రెండు' అని పోట్లాడు కుంటూనే ఉన్నారు. చూశారా! ఏదీ తెగేదాకా లాగకూడదు. ఆశకు లోబడరాదు' అంటూ ముగించారు శ్రీమాతాజీ.

# మానవ తప్పిదం

- వి. భద్రయ్య

దేవుడు ముందు భూమిని సృష్టించాడు. పగలు, రాత్రి వెలుగు నివ్వడానికి సూర్యచంద్రులను సృష్టించాడు. జీవులు మనుగడ సాగించ డానికి భూమి మీద గాలి, నీరుతోపాటు పర్వతాలు, చెట్లను కూడా సృష్టించాడు. భగవంతుడు ప్రాణికోటికి ఆయుష్షు పోస్తూ భూమి మీదకు పంపసాగాడు. చివరకు నాలుగు ప్రాణులు మాత్రమే మిగిలాయి. అవి గాడిద, కుక్క, కోతి, ఆఖరుగా మానవుడు నిలబడి ఉన్నారు.



గాడిద తన వంతురాగానే వెళ్ళి సర్వాంతర్యామి ముందు నిలబడింది. “నీకు 30సం॥ల ఆయుష్షు యిస్తున్నాను. సరిపోతుందా?” అని దేవుడు గాడిదను అడిగాడు. గాడిద ‘అంత వద్దు స్వామీ, అన్ని రోజులు జీవితాన్ని యీడ్వటం నా వల్ల కాదు. ఒక 20సం॥లు చాలు’ అన్నది గాడిద ఎంతో వినయంగా. దేవుడు సరేనంటూ గాడిద అడిగినంత మాత్రమే ఆయుష్షు పోశాడు.



తరువాత వంతు కుక్కది. దేవుడు దానికి 25సం॥లు ఆయుష్షు యిచ్చాడు. వెంటనే కుక్క ‘వద్దు ప్రభో! నా ఆయుష్షులో కూడా 10సం॥లు తగ్గించండి’ అని ప్రార్థించింది. కుక్క కోరినంత ఆయుష్షునిచ్చాడు.



ఆ తరువాత కోతి వంతు వచ్చినప్పుడు, భగవంతుడు దానికి 25సం॥లు యిస్తానంటే కోతి తనకి 15సం॥లు మాత్రమే చాలు అని చెప్పి 10సం॥లను త్యాగం చేసింది. దేవుడు ‘తథాస్తు!’ అన్నాడు.



అంత దేవుడు మనిషిని చూసి “నీకు 20సం॥ల ఆయుష్షుని యిస్తున్నాను. నీక్కూడా కొంత తగ్గించమంటావా?” అని అడిగాడు. వెంటనే మానవుడు “వద్దు స్వామీ! నాకు పూర్తి ఆయుష్షుని యివ్వండి” అని ఆతృతగా అడిగాడు.

సరేనన్నాడు దేవుడు. అయినా కూడా మానవుడు వెళ్ళిపోకుండా యింకా దేవుడి ముందు నిలబడే ఉన్నాడు.

అప్పుడు దేవుడు " ఏం కావాలి నాయనా?" అని శాంతంగా ప్రశ్నించాడు. మానవుడు "నాకు మరికొంత ఆయుష్షను ప్రసాదించండి ప్రభూ!" అంటూ నసిగాడు. "ఇంక నా దగ్గర ఏమీ లేదు. నీవే ఆఖరు వాడివి. ఉన్నదంతా పంచిపెట్టేశాను" అన్నాడు దేవుడు.



'గాడిద, కుక్క, కోతి వదిలివేసిన ఆయుష్షులు మీ దగ్గర మిగిలి పోయాయి కదా స్వామీ వాటిని నాకివ్వండి' అని అన్నాడు మానవుడు అతితెలివిగా. దేవుడు చిరునవ్వుతో తన దగ్గర మిగిలి ఉన్న గాడిద, కుక్క, కోతి ఆయుష్షులను కూడా మానవునికే యిచ్చేశాడు. తన కోరిక తీరిన మానవుడు సంతోషంగా భూమి మీదకు వచ్చాడు.

ఆ తరువాతగాని మానవుడికి తన చేసిన తప్పు ఏమిటో తెలవలేదు. దేవుడు ముందుగా మానవునికి యిచ్చిన 20సం॥లు ఏ చీకూ, చింతా లేకుండా గడిపివేస్తాడు. తరువాత ఉద్యోగం, పెళ్ళి, పిల్లలూ సంసారమూ అంటూ గాడిద లాగ బరువును మోసుకుంటూ గడుపుతాడు.

ఆ తరువాత పిల్లలు పెద్దవాళ్ళవుతారు. ఇతనికి పదవీ విరమణ వస్తుంది. ఏ పనీ చేసేందుకు ఓపిక ఉండదు. పిల్లలు ఉద్యోగాలకు వెళితే కుక్కలాగ యింటికి కాపాలకాస్తూ జీవిస్తాడు.

చివరికి నవనాడులూ కుంగి పోతాయి. కంటిచూపు మందగిస్తుంది. బ్రతుకు భారమౌతుంది. తల్లిదండ్రులను పోషించడానికి కొడుకులు ఆరు నెలలు ఒకరు, ఆరు నెలలు మరొకరు చొప్పున వంతులు వేసుకుంటారు. అప్పుడు మానవుడు కోతి ఒక కొమ్మ మీద నుండి మరొక కొమ్మ మీదకు దూకినట్లు ఒక యింటి నుండి, మరొక యింటికి...... అలా చచ్చేవరకూ తిరుగుతూ వుంటాడు.

ఆశపడి ఆయుష్ష అడిగాడు కాని ఆలోచించలేదు అందుకే .......ఇప్పుడు చింతించి ఏమి ప్రయోజనం?

# పరిప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

స్వప్నంలో ఎన్నో సంఘటనలు జరుగుతాయి. కత్తితో కోసినట్లు, రక్తం కారినట్లు, ఆ బాధకి దుఃఖించినట్లు తీరా మెలకువ వచ్చేసరికి, స్వప్నంలో పొందిన అనుభూతి మాత్రం జ్ఞాపకం ఉంటుంది గాని, దేహం గాయం అవ్వటం, రక్తం కారటం అనేవి ఉండవు. వెంటనే అది కలగా గుర్తించటం జరుగుతుంది. అయితే ఆ అనుభూతి పొందినప్పుడు జాలువారిన అశ్రుధారలు గుర్తులు మాత్రం కనబడతాయి. అంతవరకు ఏ రకమైన వివాదాంశము లేదు.



జగత్తు అనేది మిధ్య. జన్మకి వచ్చిన మానవుడి స్థితి కూడా స్వప్నావస్థే అని పెద్దలు అనటం ఎంత వరకు సమంజసం? అన్న ప్రశ్నకి సమాధానంగా సద్గురుదేవులు "ఈ జగత్తు అంతా బ్రహ్మమే. జగత్తు బ్రహ్మము యొక్క ప్రతిబింబము. దానిని గుర్తించగలగాలంటే ఈ స్వప్నావస్థలో నుండి మేల్కొని నిజజాగ్రదావస్థకి చేరినప్పుడే గుర్తించగలుగుతావు. ఇది యదార్థంగా జాగ్రదావస్థలో స్వప్నం".

ఇంతలో వేరొక భక్తుడు 'మనం నడుస్తున్నాము, తింటున్నాము, మాట్లాడుతున్నాము ఇవి అన్నీ మనకు తెలుస్తున్నాయి. అంతేకాదు ఈ అవస్థలో ఏదైనా సంఘటన జరిగితే అది జరిగినట్లు గుర్తుంటోంది కదా! స్వప్నావస్థ కేవలం అనుభూతేగాని, జరిగిన సంఘటనలు తాలుకు గుర్తు ఉండటం లేదు కదా' అని అడిగారు.

శ్రీబాబు మాట్లాడుతూ "నువ్వు స్వప్నావస్థలో ఉన్నంతవరకూ స్వప్నానుభూతి ఏదైతే ఉంటోందో అదీ యదార్థంగానే తోస్తోందికదా! అది యదార్థం కాదన్న విషయం స్వప్నం నుంచి మెలుకవ వచ్చినప్పుడే కదా తెలుసుకోగలుగుతున్నావు. అలాగే ఇప్పుడు నువ్వు పొందేది దీర్ఘ స్వప్నావస్థ దీని నుంచి మేల్కొనప్పుడు కదా యీ అవస్థను స్వప్నావస్థ అని గుర్తించేది. మనస్సు మాయ అనే బంధనలో ఉన్నంతవరకు స్వప్నానుభూతి నుంచి విముక్తి కలుగదు. బంధవిముక్తి పొందిన తరువాత నిజజాగ్రత స్థితిలో నీవెవరవో గుర్తెరిగి మేల్కొని దీనిని జాగ్రదావస్థలో స్వప్నంగా గుర్తించగలుగుతావు" అన్నారు.

# షోలాపూర్‌లో సత్సంగాలు

- జపమాలా ప్రసాద

మహారాష్ట్రలోని షోలాపూర్ నగర భక్తులయిన శ్రీ శంకర్‌సింగం, శ్రీ సుధాకర్‌సింగం గార్లు తమ తండ్రిగారైన కీ॥శే॥ స్వర్గీయ శ్రీవేంకటేశ వెంకయ్య సింగ్‌గారి స్మృత్యర్థం 20-3-14 నుండి 26-3-14 వరకు సత్సంగ సమావేశాలను సాప్తాహ్నికంగా ఏర్పరచి, పూజ్యశ్రీ యోగిని శ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీవారిని ఆహ్వానించారు. శ్రీమాతాజీవారి ఆధ్వర్యంలో రెండువేళలా సత్సంగ సమావేశాలు దివ్యంగా, భవ్యంగా జరిగాయి.

ఉదయం సుప్రభాతసేవ, ప్రార్థన, పూజాదికాలు ముగించుకుని అమ్మతో మేము 5-30ని॥ 'శ్రీనవ దుర్గ' ఆలయానికి వెళ్ళేవారము. శ్రీ నవదుర్గాదేవి ఆలయంలోనే ఉదయం 6గం.ల నుండి 7గం.ల వరకు శ్రీమాతాజీ, భగవద్గీతా సారాన్ని ప్రవచనం చేశారు. అంత ప్రాతఃకాలంలో భక్తులు అశేషంగా తరలిరావటం విశేషం!

ఇక సాయంత్రం వేళ శ్రీసువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని విశాల మైదానంలో 7గం.ల నుండి రాత్రి 9గం.ల వరకు శ్రీమాతాజీవారి 'భాగవత ప్రవచనం' ఏడు రోజులూ జరిగినది. నేల ఈనిందా! అన్నట్లు ఆ మైదానం అంతా భక్తజనులతో నిండిపోయేది!

21-3-14 శుక్రవారం నాడు మహారాష్ట్ర దేశంలో 'హోలీ' జరుపుకుంటారు కనుక తత్ సందర్భంగా అమ్మకు పంచదార చిలుకల దండవేసి అలంకరించి, భక్తులు గులాల్‌ని (రంగులను) అలది, అమ్మను సేవించుకున్నారు.

25-3-14 మంగళవారం ఉదయం 7-30ని॥లకు శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలోనే సామూహికంగా హనుమాన్‌చాలీసా పారాయణ జరిగింది. ముడు వందల మందికిపైగా భక్తులు పాల్గొని, ఏకకంఠంతో చాలీసా పారాయణ చేయటం వారి భక్తిశ్రద్ధలకు అద్దం పట్టిందని చెప్పవచ్చు.

ఆంజనేయ స్వామిని వడమాల, నిమ్మకాయల దండలతో అలంకరించారు. భక్తులందరూ 11సార్లు పారాయణకు 11తమల పాకులను స్వామికి సమర్పించుకున్నారు.

26-3-14 చివరిరోజు శ్రీమాతాజీవారు ఉదయం, సాయంత్రం కూడా పాద నమస్కారాన్ని ప్రసాదించారు. శ్రీమాతాజీవారు అక్కడి వారి భక్తి శ్రద్ధలకు ముగ్ధులై యిలా శెలవిచ్చారు - "మీరందరూ ఆంధ్రదేశం నుండి మహారాష్ట్రకు వచ్చి, ఇక్కడి భక్తిగంధాన్నంతా పూసుకుని పునీతులయ్యారు. భగవద్గీతలో ఎన్ని అక్షరాలు వున్నాయో, అంతమంది భక్తులతోను, జ్ఞానులతోను నిండి ఉన్నది కనుకనే యీ నేల 'మహా రాష్ట్ర' మయింది. ఇటువంటి పుణ్యభూమికి వలసవచ్చి, మీరందరూ యీ గంధాన్ని సంతరించుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

అంతేకాకుండా సత్సంగం యొక్క గొప్పదనాన్ని మీకు చెప్పి, మహాత్ములందరినీ యిక్కడకు రప్పించి, సత్సంగ సమావేశాలను ఏర్పరచి, ఒరవడి దిద్దిన బ్రహ్మీభూతులయిన శ్రీ మల్లయ్య మహరాజ్‌వారు మహానుభావులు- ప్రాతఃస్మరణీయులు. అదే విధంగా యిప్పటికీ సత్సంగ సేవ చేసుకుంటున్న మహారాజ్‌లందరికీ ఎంతో కృతజ్ఞతలు తెలుపుకోవాలి మనం.

మహాత్ములదగ్గరకు వెళ్ళి, పాదాలకు మ్రొక్కి దండలు, పూలు వేయాలని, ప్రసాదాలని తీసుకోవాలని, యిటువంటివాటిని వేటినీ కోరక, కేవలం టైం ప్రకారం వచ్చి, ప్రవచనామృతాన్ని గ్రోలి, తిరిగి టైమ్ ప్రకారం యిళ్ళకు వెళ్ళిపోయే యిటువంటి భక్తులని చూస్తే ఎంతో ముచ్చటవుతోంది. ఈ భక్తులు కూడా 'అమ్మా! మీరు మాకు ఏమి యీయనక్కర్లేదు. ముచ్చటైన మాటలు చెప్పండి చాలు, మా కడుపు నిండిపోతుంది' అని అంటుంటే మేము ఆనందంతో పొంగిపోతున్నాం! అందుకే షోలాపూర్ వచ్చి భక్తుల సేవ చేసుకోవడం మాకు ఎంతో యిష్టం." అని శ్రీమాతాజీవారు పదేపదే వక్కాణించారు.

# నీ పేరేమో దేవుడట - నీ దయ ఉంటే చాలునట

-పెనుమాక నాగేశ్వర రావు

ఏకశిలా పురవాసుడవో
మధురాపురి నిలయుడవో
హిమగిరి వాసుడవో
బృందావన చంద్రుడివో
నీ పేరేమో దేవుడట! - నీ దయ ఉంటే చాలునట!

రఘుకుల తిలకుడవో
యదుకుల వీరుడవో
గురుకుల చంద్రుడవో
నీ పేరేమో దేవుడట! - నీ దయఉంటే చాలునట!

కల్లా కపటం చెల్లవుట
మోసం, మోహం కుదరవుట
ద్వేషం రోషం పొసగవుట
ప్రేమ దయలే సొగసులట
సత్యం శాంతి నిత్యమట
నీ పేరేమో దేవుడట! - నీ దయఉంటే చాలునట!



# భగవద్గీత – వర్తమాన సమాజం

- రేఖ

"ఈశావాస్య మిదగ్ం సర్వం' అని ఉపనిషత్ చెప్పినట్లుగా, కరెంట్ ఎలా అయితే అంతటా ఉన్నదో, అదే విధంగా భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. ఈ సత్యాన్ని గురువులు, మహాత్ములు అనుభవించి వారి పదముల ద్వారా, బోధ ద్వారా, గీతామకరందం వంటి గ్రంథముల ద్వారా తానెవరో తాను తెలుసుకునేటట్లు చేస్తారు.

ఏకలవ్యుడు అత్యంత భక్తి శ్రద్ధలతో, లక్ష్యశుద్ధి కలిగి, తన మనస్సులోనే ద్రోణాచార్యులవారిని గురువుగా నిశ్చయించుకుని, విలు విద్యను సాధించాడు. గురు పాదాన్ని ఆశ్రయించాలి. గురి కుదిరితే, గురు పాద సన్నిధి నిజమైన పెన్నిధి అని నమ్ముతాడు. అట్టి గురితప్పని నిజదృష్టికి గురుతు 'తానే' అని గుర్తిస్తాడు. ఇదే పరమసత్యం" అన్నారు.

శ్రీమాతాజీ ఇంకా మాట్లాడుతూ "నిత్య జీవితంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ, గీతామాతను ఆశ్రయిస్తే, ధార్మికత్వాన్ని బోధించి, ధర్మమార్గంలో నడుచుకునేట్లు చేస్తుంది. ఈ సందర్భంగా అర్జునుడు ఏవిధంగా కృష్ణపరమాత్మను ఆశ్రయించాడో తెలిపారు. ఎప్పుడైతే అర్జునుడు తన తప్పును తాను తెలుసుకున్నాడో 'కార్పణ్యదోషో పహత స్వభావః' (గీత2/7) అని భగవానునికి శరణాగతుడయ్యాడు. శిష్య స్థానంలో ఎంతో వినయ విధేయతలతో ఆత్మార్పణం చేసి, చరణా క్రాంతుడయ్యాడు. అప్పుడు జగద్గురు శ్రీకృష్ణపరమాత్మే గురుస్థానమును ఆక్రమించాడు. శిష్యుడు పరమార్థ తత్వాన్ని గుర్తించడానికి, అహంకారాన్ని పారద్రోలడం, శరణాగతితో, వినయవిధేయతలతో తలవంచి పాదాక్రాంతుడు అవడం ముఖ్యసాధనాలు. ఈ విధంగా మనస్సు అంతర్ముఖమై తత్వం గుర్తిస్తుంటే, అప్పుడు ఆనందం అనుభవైకం అవుతుంది.

ఆవిధంగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు గీత యొక్క లక్ష్యశుద్ధి కలిగి, తాము ఆ మూలతత్వాన్ని, ఆనందాన్ని అనుభవిస్తూ, ఆ మకరందాన్ని నగరాలకీ, చిన్నచిన్న ఊళ్లకి కూడా వెళ్ళి, పండితులకు, పామరులకు, స్త్రీలకు, చిన్నవారికి, విద్యార్థులకు తమ ప్రవచనాల ద్వారా, తమ గ్రంథ రచన ద్వారా అందించగలిగారు. సర్వమానవాళిని ఉత్తేజ

పరచ గలిగారు.

ఎప్పుడైతే ఆచరణ ధర్మపరంగా ఉంటుందో అప్పుడే సత్యాన్ని గుర్తించి అనుభవించ గలుగుతాం. చివరికి కృష్ణభగవానుడు 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (గీత18/66) అని సెలవిచ్చాడు. ఈ శ్లోకములో సమస్త ధర్మాలను విడిచిపెట్టమంటే అధర్మం ఆచరించమని కాదు; లేకపోతే సమస్త ధర్మాలను వదలిపెట్టి సోమరిగా ఉండమని అర్థం కాదు. అన్నిటికంటె పెద్ద ధర్మం భగవంతుని శరణాగతి పొందటము. విషయాదులను విడిచిపెట్టి ఆత్మనొక్కదానినే శరణు పొందటం. ఆ విధంగా అట్టి మహద్ధర్మాన్ని ఆశ్రయించినప్పుడు, చిన్నచిన్న ధర్మాలను పట్టుకోవలసిన పనిలేదు.

మానవుడు ఎప్పుడూ ఆనందంగా, సంతోషంగా ఉండటానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. దృశ్యవస్తువులు శాశ్వత ఆనందాన్ని యివ్వలేవు కదా. అందుకని శోకరహితమైన శాశ్వత సుఖాన్నీ, ఆనందాన్ని యిచ్చే భగవానుని శరణుపొంది, జ్ఞానోదయమయి, తద్వారా సర్వ పాపముల నుండి విముక్తి పొందితే మోక్షప్రాప్తి కలుగుతుంది. ఈ ఒక్క శ్లోకం ద్వారా శ్రీకృష్ణపరమాత్మ, చదువురానివారైనా, పండితులైనా, ఎవరైనా సరే, భగవంతుని యందు నిర్మల భక్తి, పరిపూర్ణ శరణాగతి కలిగివుంటే చాలు మోక్షానికి అర్హులవుతారు అని లోకానికి చాటిచెప్పాడు." అన్నారు.

-సశేషం

**ఒకచోట కుస్తీ ఆట జరుగుతోంది. ప్రేక్షక లోకం పై నుండి చూస్తున్నారు. ఆ కుస్తీ ఆటలోని నిజమైన ఆనందాన్ని కుస్తీ ఆడేవారు పొందలేరు. వారి చిత్తములో ఆయాసము. అశాంతి ఉంటాయి. అంతేకాని శాంతి ఉండదు. చెక్కు చెదరక సాక్షి రూపంలో పైనుండి చూసే ప్రేక్షకులే నిర్వికారమైన ఆనందాన్ని అనుభవించేది.**

- వెంకట రమణ ప్రసాద్

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

32. శ్లో॥ త్వచ్ఛైశవం త్రిభువనాద్భుత మిత్యవైమి
యచ్చాపలం మమ వాగవివాద గమ్యామ్
తత్కిం కరోమి విరణ న్మురళీ విలాస
ముగ్ధం ముఖామ్బుజ ముదీక్షితుమాక్షరాభ్యామ్ ।

నీ బాల్యము ముల్లోకముల యందు విచిత్రమైనది. నా మనస్సు చంచల మైనది. ఏమి చేయుదును? పిల్లన గ్రోవి ఊదుచూ మనోహరమైన నీ మోమును చూచుట యెట్లా అని చింతిస్తున్నాను.



తలుపు తట్టి నిలబడ్డారు తల్లీకూతుళ్ళు ఇద్దరూ ఆసక్తిగా చూస్తూ, తలుపు తీసేవారిని చూద్దామని. 'వచ్చె వచ్చె' అంటూనే తలుపు తీసింది యశోదమ్మ. చంకలో సూరె గుమ్మడిపండు లాంటి బొజ్జ ఉన్న పిల్లవాడిని ఉంచుకుని, అందమైన యశోదమ్మకన్న మరింత అందంగా ఉన్నాడు వాడు. అప్పుడే నీళ్ళు పోసినట్లు ఉంది. ఒంటిమీద తుడిచినా తడి యింకా ఆరలేదు. చందనం సుగంధ ద్రవ్యాల పొడి కలిపిన సున్నిపిండి నలుగుపెట్టి స్నానం చేయించిందేమో, ఆ సువాసనలు అక్కడంతా వ్యాపించాయి. కూతురు పేరు దీప. అది కనులు విశాలం చేసుకుని చూస్తోంది తల్లీ బిడ్డలను. అదే తొలిసారి వారింటికి రావటం, వాడిని చూడటం. దీప రూపం దీపంలాగే ఉంటుంది. దాని ముక్కుకి ఆ వాసనలు సోకేసరికి హాయి! అనుకుంది. చంటివాడి ఒంటి నీలి మెరుపులు, పెద్దపెద్ద కళ్ళలోని కాంతులు, దీప కళ్ళని మెరుపుల్లా తాకాయి.

"దంపుళ్ళ చావడిలో రోకళ్ళున్నాయి. ఒడ్లు రోట్లో పోసుకో. మల్లన్న కూడా వస్తున్నాడు నీకు సాయంగా. వెళ్ళమ్మా" అంది యశోదమ్మ తల్లికి పని పురమాయిస్తూ. తల్లితో రెండు అడుగులు వేయబోయిన దీపను "నీవిలా రావే! పెరట్లో చెట్లకి విచ్చిన పూలున్నాయి అవి కోసుకురా" అంది యశోదమ్మ.

దీప కన్నార్పకుండా చిన్నవాడిని చూస్తూ ముందుకు నడిచింది.

పూలుకోసి లోపలికి వచ్చేసరికి యశోదమ్మ బిడ్డకి సాంబ్రాణి పొగవేసి, నట్టింట్లో కూర్చోబెట్టి బట్టలు తీసుకురావడానికి లోపలికి వెళ్లింది. దీప అక్కడున్న స్థంభానికి ఆనుకొని నిలబడింది. పిల్లాడికి చేతికి అందనంత దూరంలో వెన్నపిడత ఉంది. ఒక చేతిని ఆ పిడతలోపెట్టి గుప్పెడనిండా వెన్నతీసుకుని నోట్లో పెట్టుకుంటుంటే వాడి ఎర్రటి పెదాలు నున్నటి వెన్న తగిలి మరింతగా మెరుస్తున్నాయి. మళ్లీ మరో ముద్ద తీసుకుని వెన్న తింటుంటే మూతి, ముక్కు, బొజ్జ నిండా వెన్నే!

ఈసారి వెన్న తీసుకుని చేతినిండా, కాళ్ల నిండా రాసుకున్నాడు యిందాక వాళ్లమ్మ నలుగు పెట్టినట్లుగా. ఈలోగా పిల్లి వచ్చింది. సరాసరి వాడి చెంతకే వెళ్లింది నవ్వుతూ. దానికీ వెన్న పెట్టాడు. తినేసి వాడి కాళ్ళు, ఒళ్ళు నాకుతోంది. వాడికి కితకితలు పెట్టినట్లు అయింది. వెన్న చేతులతో కాళ్లతో అక్కడంతా పాకేస్తున్నాడు. కిలకిలా నవ్వుతున్నాడు. వాడి కాళ్లకున్న బంగారు మువ్వలు గలగలమని చప్పుడు చేస్తున్నాయి. దీప యిదంతా మైమరచిపోయి చూస్తోంది.

లోపల నుండి యశోదమ్మ వచ్చేసరికి పిల్లాడి ఒళ్ళు, యిల్లు, నేల అంతా వెన్న. పిడతలో పిసరంత కూడా మిగల్లేదు. 'కన్నయ్యా!' ఒక్క అరుపు అరిచింది అంతే! ఆవిడకి నవ్వు, ఏడుపూ రెండు వచ్చాయి. ఆవిడ కేకకి పిల్లి భయపడి పారిపోయింది. దీప ఉలిక్కిపడి తెలివిలోకి వచ్చింది. 'ఏమే! యిదంతా బొమ్మలాటలా చూస్తున్నావా? పిల్లవాడిని కాస్త వెనక్కి తీయకూడదా?' అని కసిరింది. దీప బిక్క మొహం పెట్టింది. 'వెళ్లి మీ అమ్మను పిలచుకురా. ఇదంతా శుభ్రం చేస్తుంది.' దీప మనసులో కన్నయ్య చేసిన అల్లరి ముగ్ధ మనోహర రూపం మరచిపో లేని విధంగా ముద్రవేసుకుంది. యశోదమ్మ అన్నట్లు వాడిని వెనక్కి తీస్తే , ఆ ఒంటిని తాకితే ఒళ్ళు ఝల్లుమంటూ యింకెంత బాగుండేదో! అనుకుంది దీప.

అనంతర కాలంలో దీప తల్లి జబ్బు చేసి, ఒకనాడు కన్ను మూసింది. ఎవరూ లేని ఒంటరిదైపోయింది పదిఏళ్ల దీప. అందుకే లోకానికి వెరచి దీపని వాళ్ల ఊరు తీసుకెళ్లిపోయింది వాళ్ల పెద్దమ్మ. పొరుగూరులో వాళ్ల యింట్లో యిమడక తప్పలేదు దీపకు. అలాగే ఐదారేళ్ళు గడచిపోయాయి.

-సశేషం

# సత్యం శరణం గచ్ఛామి

– వశిష్ఠ

మానవ జీవితం క్షణ భంగురం. నీటి బుడగ వంటిది. నీటి బుడగ ఆకారంలో ఉండే బౌద్ధ స్థూపాల శిరస్సులు యీ సత్యాన్ని గుర్తు చేస్తాయి. పరిమితమైన యీ జీవతకాలంలోనే మనం ఎందుకు పుట్టామో, ఏది పొందాలో, ఏది చస్తే మనం యిక ఎప్పుడూ చావకుండా ఉంటామో తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలన్నా, ఆ పాశం నుండి తప్పించుకోవాలన్నా, గురుదేవుని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని మనస్సులో నిలిపి ధ్యానించాలి.

అయితే ఆచార్యుడు గీతాచార్యునివంటి వాడై ఉండాలి. అంతేగాని చెవిలో మంత్రం, చేతిలో రూపాయి అనే గురువును ఆశ్రయిస్తే గుడ్డివాడిని పట్టుకుని మరో గుడ్డివాడు నడచినట్లే అవుతుంది. సత్యస్వరూపులైన ఆచార్యులెందరో మన పవిత్ర భారతదేశంలో ఉద్భవించారు.



స్వామి రామతీర్థ తనను బెదిరించ వచ్చిన అమెరికా పెద్దమనిషితోరాతిలో, వృక్షంలో, నదిలో, నదిహోరులో, మేఘాలలో, మేఘగర్జనలో ఉన్నది 'నేనే' (ఆత్మ వస్తువు)నని, సర్వవ్యాపకుడనని, శాశ్వతుడనని, కత్తితో నరకబడనని, అగ్నిలో తగలబడనని, నీటిచే తడవ బడనని, నీకు కాదుకదా నిన్ను పుట్టించిన వాడికి జడవనని అన్నాడు.

శ్రీరామకృష్ణ పరమహంస తయారుచేసిన వివేకానంద అనే బాంబు మన దేశంలోనే కాక, విదేశాలలో కూడా సంచలనం సృష్టించి, నవచైతన్యం రేకెత్తించింది. ఈ బాంబు మానవ మారణహోమం చేసేది కాదు. మానవ హృదయాలలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞాన జ్యోతి తేజస్సుతో నింపి, మానవుని మాధవునిగా మార్చివేయగలిగినది.

ఇతర మతాలు నదులవంటివైతే, హిందూమతం సముద్రం వంటిదని అన్ని మతాలను, అన్ని తత్త్వాలను తనలో యిముడ్చుకోగల విశాల గంభీర మతమని, విశ్వవ్యాప్తంగా చాటిచెప్పింది. ఆ వివేక జ్యోతి యీనాటికీ ప్రకాశిస్తోంది. అది భారత జ్యోతి. అది అఖండము. దాని కాంతి ఎంత గొప్పది! అది కొలతకు అందనిది. అది ఆదిమధ్యాంత

రహితమైనది, అతి సనాతనమైనది.

మతం తల్లివంటిది. తల్లి తన బిడ్డకు ఎప్పుడేమి కావాలో చూసుకుని ఎలా రక్షించుకుంటుందో మతం కూడా అలాగే మానవుని రక్షిస్తుంది. తప్పుతోవలో వెళ్ళే మానవులను సన్మార్గంలోకి మళ్ళించి మనస్సులను పవిత్ర భావాలతో నింపుతుంది. సోదర మానవుల యెడల జాతి, కుల, వర్గ రహితమైన ప్రేమను, సహనశీలాన్ని నేర్పుతుంది.

ఆధ్యాత్మ దృష్టిని కలిగించి, సుఖశాంతులను అందజేస్తుంది. విశ్వశాంతికి లోకకళ్యాణానికి దోహదం చేస్తుంది. తోటి మానవులను మోసం చెయ్యమని ద్వేషించమని ఎన్నడూ చెప్పదు. అదే సత్యమతము. అదే ధర్మమతము. అదే సంఘమతము.

సత్యం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!

**సంపత్కరమైన ఇక్ష్వాకు వంశమునకు చెందిన రఘు మహారాజు యొక్క వంశపరంపరలో జన్మించినవాడా! సొగసైన తులసీదళములచే కూర్చబడిన దండను ధరించి, శాంతి, ఓర్పులనెడి యింపైన గుణములచే ప్రకాశించువాడా! ముల్లోకములందు పొగడదగిన పరాక్రమ లక్ష్మియే ఆభరణముగా గలిగినవాడా! అడ్డుకొనుటకు అలవిగాని కబంధుడను రాక్షసుని వధించినవాడా! ప్రపంచ మందలి మనుజుల యొక్క పాపములనెడి సముద్రములను దాటింపగల 'రామ!' అను పేరుగలవాడా! దయకు సముద్రము వంటివాడా! భద్రాచలమనెడి కొండ పైభాగమున నివాసముగల దశరథ మహారాజు కుమారుడవైన ఓరామా!**




(దాశరథీ శతకము/1)

# పిబరే రామ రసం

- రమణ ప్రసాద్

ధ్యానం మనకంటె భిన్నంగా లేదు. దానిని గమనించాలి. లేకుంటే అది పరధ్యానమవుతుంది. ధ్యేయవస్తువుపై నిలబడేవరకు సాధన చెయ్యాలి. 'ఓం' అనే శబ్దంలో నుంచి సృష్టి, స్థితి, లయాలు వచ్చాయి. గురుదేవులు 'అ' అంటే బ్రహ్మ, 'ఉ' అంటే విష్ణువు, 'మ' అంటే మహేశ్వరుడు అని సులువుగా తెలియజేశారు.

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే ।

వ్యోమవత్ వ్యాప్తదేహాయ దక్షిణా మూర్తయే నమః ॥

ధ్యానానికి మూలం ఒక నమ్మకం. విశ్వాసం. గురుదేవులు మనలను తమ పాదాలవద్దకు చేర్చుకున్నారు. మనం వారి ముఖస్తుగా వచ్చిన పదములను మననం చేసి, ఆచరణలో పెట్టుకోవాలి.

సత్యాన్ని గుర్తించు. ధర్మాన్ని ఆచరించు. అప్పుడు ధ్యానం నీ వెంటబడి వస్తుంది. రసోవై సః భగవంతుడు రసస్వరూపుడు.

పిబరే రామ రసమ్. రసనే పిబరే రామరసమ్ । జనన మరణ భయ శోక విదూరమ్। సకలశాస్త్ర నిగమాగమ సారమ్ ॥

- ఆ రామరసాన్ని శుక శౌని మునులు పానం చేశారు. గురుదేవులు చెప్పేవారు "ఆంజనేయుడు రామ రసాన్ని త్రాగి త్రాగి 'అపనే ఆప్‌కో భూల్ గయా' తనను తాను మరచిపోయాడు" అని.

ఆ స్థితికి రావాలంటే నాలుగు దాటాలి. మనో బుద్ధి చిత్తాహంకారాలు, అవి సత్యం శాంతి దయ ప్రేమగా మారాలి.

సూరదాసు భగవంతుని దర్శించటానికి ఆలయానికి వెళితే 'నువ్వు అంధుడివి కదా! ఆలయానికి ఎందుకు వచ్చావు?' అని అక్కడివారు అడిగారు.

సూరదాసు "ఔను! నేను చూడలేను. కానీ భగవంతుడు నన్ను చూస్తాడు కదా!" అని సమాధానం చెప్పాడు. "అంత్యకాలంలో నీ నామ స్మరణ మరచిపోని స్థితిని నాకు ప్రసాదించు" అని సూరదాసు భగవంతుడిని వేడుకున్నాడు.

ఓం శ్రీగురుభ్యోనమః శ్రీమాత్రే నమః

## శ్రీ హనుమత్ కాళీ వరప్రసాదబాబు ట్రస్టు రెసిడెన్షియల్ స్కూల్

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచేత గుర్తింపబడిన సంస్థ)

నర్సరీ నుండి 10వ తరగతి వరకు తెలుగు&ఇంగ్లీషు మీడియంలలో విద్యాబోధన

శ్రీకాళీగార్డెన్స్, నంబూరు (R.S) గుంటూరు జిల్లా.

ప్రియమైన తల్లిదండ్రులారా! మరియు విద్యార్థినీ విద్యార్థులారా!

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవంతో కూడిన అధ్యాపకులు ప్రణాళికా బద్ధముగా రూపొందించిన కార్యక్రమముల ద్వారా ఆర్జించేది. ఇటువంటి విద్యకు నిదర్శనంగా 1981లో స్థాపింపబడిన 'శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూల్' నేటివరకు ఎంతోమంది గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తుకు పునాది వేసిన సంస్థ. ఈ సంస్థలో చదువుకున్న అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు, అత్యుత్తమ పౌరులుగా అనేక రంగాలలో దేశ, విదేశములలో, ఉత్తమ స్థానంలో రాణిస్తున్నారు. ఈ స్కూల్లో మీ చిన్నారులకు ప్రవేశం కల్పించి, మీ బిడ్డలపై మీరు కన్నకలలను నిజముచేసుకోవటానికి ఇది ఒక అపూర్వమైన అవకాశంగా భావిస్తున్నాము.

ఈ స్కూల్లో ప్రస్తుతము చదువుతున్న అర్హులైన 140 మంది ఉత్తమ విద్యార్థులు 'శ్రీచంద్రకాళీ విద్యానిధి' నుండి స్కాలర్‌షిప్‌లు ద్వారా లబ్ధి పొందుతున్నారు.

రాబోయే విద్యాసంవత్సరం (2014-2015) నుండి అర్హులైన అందరు విద్యార్థులకు, 'శ్రీచంద్రకాళీ విద్యానిధి' నుండి యీ క్రింది పట్టికలో తెలిపిన స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి మేనేజ్‌మెంట్ నిశ్చయించినది. కావున కొత్తగా చేరు విద్యార్థులు అందరూ మేనేజ్‌మెంట్ ఇచ్చే 'ఫామ్'లో అప్లై చేసుకో గలరు!

| Class | Minimum average marks to be obtained for New admission | Scholarship Rs. | Concession from school Rs. |
|---|---|---|---|
| 1st to 6th | 60% | 4000 | 500 |
| 7th to 9th | 60% | 5000 | 500 |
| 10th | 60% | 6500 | 500 |

1. క్రొత్త విద్యార్థులకు పైన చెప్పిన స్కాలర్‌షిప్ ఇవ్వటానికి యీ క్రింద చెప్పిన క్రయిటీరియా fullfil చేయాలి.

- విద్యార్థులు స్కూలు నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌లో పాల్గొనాలి.
- ఎంట్రెన్స్ టెస్ట్‌లో 60% మార్కులు స్కోర్ చేయాలి.
- పరీక్ష Maths, Science, English, Telugu లలో ఉంటుంది.

**2. పరీక్ష నిర్వహించే తేదీలు. 24-4-2014 మరియు 27-4-2014**

**సమయం - ఉదయం 10గం.ల నుండి**

**స్థలం - పాఠశాల ఆవరణలో**

3. స్కీమ్‌లో అర్హులైన విద్యార్థులు పైన ఉదహరించిన స్కాలర్‌షిప్ తప్పించి, మిగతా ఫీజులన్నీ ముందే స్కూలుకు చెల్లించాలి. ఈ విషయమై కరస్పాండెంట్ గారిని సంప్రదించ గలరు.

4. మన స్కూలు విద్యార్థులకు సంబంధించి 2013 - 2014 సం॥లో యాన్యుయల్ పరీక్షలో70% మినిమమ్ మార్కులు వచ్చి ఉండాలి.

5. 2013 - 2014 సం॥లో స్కూల్ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీషులో 50 మార్కులు లేదా అంతకంటె ఎక్కువ వచ్చి ఉండాలి. మరియు స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులో 80% attendence ఉండవలెను.

6. ఈ విద్యాసంవత్సరము 2014-2015లో 20మంది విద్యార్థులకు బస్సు ఫీజుల పూర్తి రాయతీ యిచ్చుటకు మేనేజ్‌మెంట్ నిశ్చయించినది.

గమనిక : బడ్జెట్‌కు మించి ఎక్కువ విద్యార్థులు ఉన్నయెడల స్కాలర్‌షిప్‌లు first cum first basis లో యివ్వబడతాయి.

Contact :
Dr. K.V.R. Ramana, M.Sc., Ph.D.,
Correspondent
S.H.K.V.P.B.R. SCHOOL
SRI KALIGARDENS, NAMBUR(R.S)
Guntur dist., A.P.
Cell 93932 20400; 94411 27078; 0863-2594211

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు
(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)
అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్‌యకె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

## ప్రత్యేకతలు

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

150మంది అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సంస్కృత మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

* ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
* క్రమశిక్షణ సత్ ప్రవర్తన
* రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
* వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
* డేస్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
* బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
* నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

<u>గమనిక</u> - స్కూలు ది. 4-6-2014న తెరువబడును. వివరములకు కరస్పాండెంట్ గారిని స్వయంగా గాని, ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

Contact :
(Dr. K.V.R. Ramana, M.Sc., Ph.D., Head, FVT & Dy. Director (Rtd)
C.FT.R.I. MYSORE.)
Correspondent,
Phone : 0863-2594211 (S); 0863-2293824(H)
Cell 93932 20400; 94411 27078;

# శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్



శ్రీదత్త గురువు చెప్పిన విషయాలన్ని విన్న పరశురాముడు నమస్కరించి, గౌరవ పూర్వకంగా తిరిగి యీ క్రింది విధంగా ప్రశ్నించారు. “భగవన్! మీరు బోధించిన విషయాన్ని విచారణ చేసి సారాన్ని గ్రహించాను. జ్ఞానము సత్యము యదార్థమే. అద్దములో ప్రతిబింబములాగ జ్ఞానములో దృశ్యం కూడా కల్పితమే. అందువలన అది మిధ్య. చితి దృశ్యానికి విలక్షణమది. అదే ఈశ్వరి. జ్ఞానమే చితిక రూపము. అది అనంతశక్తి. ఈ జగత్తుకు ఆ పరమేశ్వరియే కారణము. అయితే జ్ఞేయము లేని కేవల జ్ఞానము అనేది అవగతం కావటం లేదు. జ్ఞేయం లేని జ్ఞానాన్ని గ్రహించటం సాధ్యమా అన్నది సందేహంగా ఉంది.



గ్రహించటానికి సాధ్యం కాకపోతే అది అజ్ఞానమే కదా. మోక్షానికి సాధనం కాకపోతే, అది కూడా బంధహేతువే కదా! జ్ఞానం కలిగిన తరువాత జీవించి ఉండగానే మోక్షాన్ని పొందిన వారు లోకంలో వ్యవహారాలు ఎలా నిర్వహిస్తారు? జ్ఞానులు కూడా చాల మంది వ్యవహారాలు నడుపుతున్నారు కదా. వ్యవహారము అంటే వికల్ప జ్ఞానము. అంటే భేద జ్ఞానము కదా. మరి జ్ఞానము అద్వితీయమైనప్పుడు జ్ఞేయం అనేకం ఎలా అవుతుంది. శుద్ధ జ్ఞానం ఒక్కటే ఉంటే మరి భేదరూపమైన వ్యవహారానికి అవకాశం ఉండదు కదా. ఏకము అనేకము అనేవి పరస్పర విరుద్ధమైనవి కదా!



మోక్షసాదనమైన విజ్ఞానము, జ్ఞానఫలమైన మోక్షము అనే ఈ రెండింటిలో నానత్వం లేకపోతే జ్ఞానులు లోకంలో రకరకాలుగా ఎందుకు ఉన్నారు?

జ్ఞానుల్లో కొందరు దేవతలను ఆరాధిస్తున్నారు, కొందరు దేహేంద్రియాలను నిగ్రహించి సమాధిలో ఉంటున్నారు. మరి కొంతమంది ఉపవాసాలతో శరీరాన్ని శుష్కింపజేసి, తపస్సు చేస్తున్నారు. కొందరు శిష్యులకు తమ బోధలను అందిస్తున్నారు.

ఇలా అనేక విధాలుగా ఉన్నా, జ్ఞానత్వం అనేది ఒకటేనా లేక అనేక విధాలా? జ్ఞానము, మోక్షములో భేదం లేనప్పుడు యీ తారతమ్యాలకు కారణం ఏమిటి?

నా యీ సమస్యలను తీర్చడానికి సమర్థులు మీరు. అయినా నేను మీ శిష్యుడను. అందువలన మీ కృపావర్షంతో నా సంశయాలు తీర్చి, నన్ను మీ దరిచేర్చుకోమని వేడుకున్నాడు భార్గవుడు.

దయ కలిగిన దత్తుడు పరశురాముని ఉద్దేశించి మాట్లాడుతూ "పరశురామా! ఆత్మతత్వాన్ని తెలుసుకోవటానికి సమర్థుడవు. భగవదనుగ్రహం లేనిదే ఎవరూ శ్రేయస్సుని పొందటానికి అర్హత, సద్విమర్శ లేక విచారణయే సాధనము. నీది పరోక్ష జ్ఞానము. విచారణ ద్వారా అపరోక్ష జ్ఞానాన్ని పొందుతావు. అప్పుడు సందేహాలకు తావు వుండదు" అన్నారు దత్తగురుదేవులు.

-సశేషం


## వేసవిలో శిక్షణా తరగతులు!

ఏప్రిల్ 25 శుక్రవారం నుండి మే 25 ఆదివారం వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొ॥గు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీబాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలలో భాగంగా ది.26-11-2013 మంగళవారంనాడు పూజ్యశ్రీ మాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

పరమాత్మ స్వరూపాన్ని పంచదార చిలుకతో పోలుస్తాము. అది ఎక్కడ కొరికినా మాధుర్యాన్ని యిస్తుంది. మనకు గురుదేవుల అనుగ్రహంతో ఆశ్రయం దొరికింది. భావనలో, చేతలలో, నడకలో, ఆలోచనలలో నిరంతరం గురువును పెట్టుకుని ముందుకు వెళ్తుంటే మనకు ఎప్పుడూ ఆనందంగా, తృప్తిగా ఉంటుంది. ఇది మాత్రమే తృప్తి నిస్తుంది.

ప్రపంచంలో మిగిలినవన్నీ అసంతృప్తినిస్తూ ఉంటాయి. ఏదో ఉన్నది, ఉన్నదని చూపించటమే తప్ప తృప్తిని కలిగించేది ఏదీ వుండదు. ఏదైనా ఒక వస్తువుగాని, విషయంగాని లభిస్తే, అదే మరల మరల కావాలని యింకా యింకా కావాలనిపిస్తుంది. దివ్యమైన అమృత భాండం మనలో ఉన్నది, దానిని వెలికితీసి చూపించ గలిగినవారు శ్రీగురుదేవులు ఒక్కరు మాత్రమే.

అటువంటి మహాత్ములు మన ప్రార్థనను అనుగ్రహించి, మనల్ని ఆశీర్వదించటానికి వారి యొక్క మహావాక్య బోధనలను మనకు అందించటానికి అరుదెంచినటువంటి సందర్భం. పరమ పునీతమైన సమయం. ఇప్పుడు విన్నటువంటి మహత్తరమైన ప్రవచనాలను మన హృదయమనే లాకర్లో దాచుకోవాలి. ఇవన్నీ నిత్య జీవితంలో మనకు ఎంతగానో ఉపయోగపడతాయి.

గురువుల ద్వారా విన్నది హృదయంలో పదిలపరచుకుని మరల మరల మననం చేసుకుంటుంటే పాపం మన దగ్గరకు చేరదు. ఇటువంటి పుణ్యక్షేత్రంలో గురువుల దర్శనం మనకెంతో పుణ్యం కలుగ జేస్తుంది. మహాత్ముల అనుగ్రహ వీక్షణచేత మనం అంతా మరచి ఒళ్లంతా చెవులు చేసుకుని వారు చెప్పింది వింటున్నాము.

విన్నది మననం చేసుకోవాలి. స్వాతి నక్షత్రంలో వానచినుకు ముత్యపు చిప్పలో పడితే, అది ముత్యంగా తయారు అవుతుంది. అలాగే

మనం కూడా మహాత్ముల సమక్షానికి వచ్చినప్పుడు ఏ సంకల్పాలు లేకుండా, ఒళ్ళంతా చెవులు చేసుకుని విన్నటువంటి గురుబోధని, మనం వేరే పనిలో ఉన్నప్పటికి మనస్సుని గురుపాదలాపై ఉంచి దీక్షతో మననం చేసుకుంటే నిదిధ్యాస, సమాధి స్థితి కలుగుతుంది. కావలసిన ఫలితాన్ని పొందగలుగుతాము. గురుదేవులు చెప్పింది విని, దానిని ఆచరిస్తే గురుదేవుల ఋణం తీర్చుకున్నట్లే.

మన మంచి గురించి, బాగు గురించి మనమే తెలుసుకోవాలి. అది గుర్తుచేసేవారే గురుదేవులు. మనలో ఉండి ప్రకాశించేటటువంటి ఏకత్వాన్ని గుర్తుచేసేవారు గురుదేవులు మాత్రమే. మనకి తానెవరో గుర్తుచేసేది గురుదేవుడొక్కడే. మనం ఆరాధాన చేసుకుంటున్నామంటే గురువులు మనకి చెప్పి చెప్పి ప్రభువు సర్వవ్యాపకత్వాన్ని గుర్తింపజేయటం వలనే. ప్రళయాంతంలో ప్రభువు పవ్వళించేది సాగరమా, భక్తహృదయమా?

మన హృదయంలో ఉన్నవన్ని తుడిచి ఖాళీ చేసుకుంటే, ఆ హృదయంలో ప్రభువు నివసిస్తాడు. సద్భావన, శుద్ధమైన భావన మన మనస్సుకి అందివ్వాలి. అది ఎక్కడికి వెళ్ళదు. మనతోబాటే వెంటబడి వస్తుంది. మన హృదయంలో మహాత్ముల పాదాలను గట్టిగా పట్టుకుని, ఆస్వాదిస్తూ ఉండాలి. దానికి సమయ భేదం ఉండదు. నీకు మనస్సు ఎప్పుడు నిలబడితే అప్పుడు ధ్యానం చేసుకోవచ్చు. కాదనేవారెవరు?

సమయాన్ని వృథా చేసుకోకుండా, మహాత్ముల సన్నిధిని సద్వినియోగం చేసుకుంటూ, వారి దివ్యబోధలు మనసారా, ఒళ్ళంతా చెవులు చేసుకుని విని, మరల మరల మననం చేసుకుందుముగాక. శ్రీసద్గురుదేవుల పరమ అనుగ్రహాము మన అందరిపైన సదా వర్షించుగాక! శ్రీగురుపాదుకలు సర్వదా రక్షించుగాక! సుఖీభవ!!

**చతుర్ముఖ బ్రహ్మగా పుట్టేకంటే పరమ భాగవతోత్తముల గృహములో ఒక కీటకముగా నైన జన్మించుటయే నాకు యిష్టము. పరమాత్మను అనుభవించే పరమభాగవతుల గృహమే పరమ ప్రాప్యము.**

– శ్రీ యమునాచార్యులు

# వైరాగ్యానికి చిహ్నం వైశాఖ మాసం

- జపమాలా ప్రసాద

జయ నామ సంవత్సరంలో అడుగు పెట్టాము. చైత్రం వెళ్ళిపోయి, వైశాఖ మాసం వచ్చేసింది! వైశాఖం మనకి విశేషంగా వైరాగ్యాన్ని పెంపొందించుకోమని సూచిస్తుందా అన్నట్లు యీ మాసంలో మనకి అనేక మహత్తరమైన పర్వదినాలు వస్తున్నాయి.



వైశాఖ శుద్ధ పంచమినాడు అంటే మే 4వ తేదీన మూర్తీభవించిన వైరాగ్యమే అయిన శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యుల వారి జయంతి. అదే రోజున అస్మదాచార్యులైన సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్య మంగళ విగ్రహ ప్రతిష్ఠ శ్రీబృందావనంలో జరిగిన సందర్భంగా (19వ) ఏకోనవింశతి వార్షికమహోత్సవాన్ని జరపుకుంటున్నాము. మే 14వ తేదీన వైశాఖ గురుపూర్ణిమ. మహావైరాగ్య పురుషుడైన బుద్ధ భగవానుని జయంతి. మే 19వ తేదీన వైశాఖ బహుళ పంచమి. మన ఆశ్రమంలో శ్రీమహాకాళికాపరమేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి ప్రతిష్ఠా వార్షికోత్సవం. మే 23న వైశాఖ బహుళ దశమి. అంటే శ్రీగురుదశమి; శ్రీహనుమజ్జయంతి.



అహో! ఏమి భాగ్యం! వీరందరూ వైరాగ్యానికి మారుపేరులే!



శ్రీఆది శంకరాచార్యులవారి దివ్య చరిత్ర మనకందరికీ తెలిసినదే. ఆర్యాంబ, శివగురు దంపతులకు కేరళ దేశంలోని కాలడి గ్రామంలో పరమశివుడే రూపం ధరించి, ఆదిశంకరులుగా వుద్భవించారు. పువ్వుపుట్టగానే పరిమళించినట్లుగా శ్రీస్వామివారు తమ దివ్య తత్వాన్ని అనేక సంఘటనల ద్వారా వెల్లడి చేశారు.

తమ తల్లిగారికోసం పూర్ణానదిని యింటి ముందు ప్రవహింప జేశారు; భక్తితో, ఆవేదనతో

కేవలం ఒక్క ఉసిరికాయ మాత్రమే భిక్షగా తమ పాత్రలో వేసిన పేదరాలికి, కనకధారా స్తోత్రం ద్వారా శ్రీమహాలక్ష్మిని మెప్పించి, కనక వర్షాన్ని కురిపించారు. ఏడవయేటనే తల్లిని సన్యాస స్వీకారానికి అనుజ్ఞ వేడారు. కానీ తల్లి నిరాకరించగా, నదిలో స్నానానికి వెళితే, ఒక మొసలి తనను పట్టుకుని లాక్కుని వెళ్ళిపోతోందని, తల్లి తనకు సన్న్యాస దీక్షకు అనుమతిస్తేనే అది తనను వదులుతుందని .......ఒక సన్నివేశాన్ని కల్పించారు.




తల్లికి ఒప్పుకోక తప్పలేదు. లోకకళ్యాణం కోసం ఉద్భవించిన మహాపురుషుడిని ఏ మోహపాశాలు బంధించగలవు? అంత లేతవయస్సులోనే వైరాగ్యాన్ని చాటి చెప్పిన మహానీయుడు శ్రీశంకరులు!

ఇక మన గురుదేవుల గురించి ఏమని చెప్పాలి! "సదాశివ సమారంభాం। శంకరాచార్య మధ్యమాం। అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరం పరామ్। - ఈ వైరాగ్య పురుషుడి ముఖస్థగా అనేకమార్లు కీర్తింపబడిన మహానుభావుడు గౌతమ బుద్ధుడు! పుత్రేషణ, దారేషణ, ధనేషణ అనే ఈషణ త్రయంములను వైరాగ్యమనే ఖడ్గంతో అతి సునాయాసంగా ఖండించి, నిర్వాణ మార్గాన్ని ఆశ్రయించి, అనుభవించిన మహాత్ముడు బుద్ధుడు!



ఇక, ఆంజనేయ స్వామి దృఢమైన వైరాగ్యానికే మారుపేరు. స్వామి భక్తి తప్ప అన్యమెరుగని దాసాంజనేయుడు. జ్ఞానులలో అగ్రగణ్యుడు. 'దాసోహం' అనే భావనే 'శివోహం' అనే స్థితికి తీసుకెడుతుందని లోకానికి చాటి చెప్పాడు మారుతి!



ఈ పై చెప్పబడిన అవతార మూర్తులందరూ సాక్షాత్తు ఆ పరశివ అవతారములే. అప్రత్యక్షంగా ఉండే ఆ పరమేశ్వరుడు తనదైన దైవీ మాయతో మనలను ఉద్ధరించటానికి ఇందరి మహాత్ముల రూపంలో ఉద్భవించారు. పరమ వైరాగ్య స్వరూపుడు, ఆది భిక్షువు అయిన శంకరులు అడుగడుగునా, అణువణువునా వైరాగ్యాన్నే బోధించారు. కనుక మన మందరం ఈ మహాత్ములు చాటిచెప్పిన దృఢ వైరాగ్యమును అలవరచుకుని, గురు లక్ష్యార్థ సాధనలో ముందడుగు వేద్దాం!

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

మాటిమాటికి శెలవు పెట్టటం, చాలా రోజులు కాలేజీలో విధులకు హాజరు కాకపోవటం వలన తన ఉద్యోగానికే ముప్పు కలుగవచ్చుననే భయంతో ఇందిర గుంటూరు వచ్చేసింది. తీరా ఇందిర కాలేజీకి వెళ్ళేసరికి, ఆమె స్థానంలో మరొకరిని లెక్చరర్‌గా నియమించటం, వారు డ్యూటీలో చేరటం కూడా జరిగిపోయింది. మళ్ళీ గుంటూరులోనే ఇందిరకు స్థానం కావాలంటే ప్రభుత్వానికి వ్రాసుకోమన్నారు.



అప్పటికి శ్రీ బాబు వల్లభాపురంలో శ్రీకృష్ణజన్మాష్టమి పూజలకు గాను వెళ్లి ఉన్నారు. ఇందిరి సంగతి నిన్న శ్రీ బాబు, ఆమెను గురువుగారితో కలసి వల్లభాపురం రమ్మన్నారు, ఇందిర వల్లభాపురం వెళ్ళి శ్రీ బాబు సన్నిధిలో వుండగానే, ఇందిరను గుంటూరు కాలేజీలోనే మళ్ళీ నియమించినట్లు, ఆమె స్థానంలో చేరిన వారిని కర్నూలు ట్రాన్స్ఫర్ చేసినట్లు ఆర్డర్లు వచ్చాయి.

ఇందిర కాలేజీలో చేరటానికి వెళ్ళింది. ప్రిన్సిపాల్, ఇతర లెక్చరర్లు ఇందిరతో "ఇలా గుంటూరుకు ట్రాన్సపర్ తెచ్చుకో గలిగావంటే ఏ ముఖ్యమంత్రి వద్దనో, అంతకంటే పైవాళ్ళ వద్దనో పలుకబడి ఉందన్న మాట నీకు" అన్నారు. ఈ అద్భుతం ముఖ్యమంత్రులకు, ప్రధాన మంత్రులకు, రాజాధిరాజులకు కూడ అధినాధుడైన సర్వాధిష్ఠాన చైతన్య చక్రవర్తి జరిపినదని వాళ్ళకు తెలియదు. ఇందిర "నేను ఎవరి సహాయమూ కోరలేదు. ఇదంతా సద్గురు దేవుల అవ్యాజ కరుణ మాత్రమే" అన్నది.

గురువుగారు శనివారం ఒంటి పూట భోజనం చేసేవారు. రాత్రిపూట ఏమీ తీసుకునే వారు కాదు. ఒక శనివారం రాత్రి గురువుగారికి కలలో ఒక వృషభం కనిపించింది. ఆతరువాత ఒక దివ్య

బాలుడు కనిపించి 'ఆకలి వేస్తున్నది, అన్నం పెట్టు' అని అడిగాడు. గురువుగారు శనివారం రాత్రి భోజనం చెయ్యరు. అందువల్ల వంటచేయలేదు. అయినా ఆమె ఎందుకో ఆ స్వప్నమును స్వప్నంగా భావించక, అప్పటికప్పుడు వంట చేశారు. ఇంట్లో వాళ్లకు ఆవిడ ఆ సమయంలో ఎందుకు వంట చేస్తున్నారో అర్థం కాలేదు. వంట పూర్తి అయీ, కాక ముందే శ్రీ బాబు ' ఆకలి, ఆకలి' అంటూ ఊరి నుంచి వచ్చారు. వంట సిద్ధంగా ఉండటం వల్ల గురువుగారు వెంటనే వడ్డించారు.

శ్రీబాబు భోజనం చేస్తూ, ఒక ముద్ద గురువుగారికి యిచ్చి 'ఇదిగో గురు ప్రసాదం' అన్నారు. గురువుగారు ఒక్క క్షణం సందేహంలో పడ్డారు. శ్రీ బాబు "ఓహో! ఇది అన్నం కదా! గురుప్రసాదమే అయినా తమకు శనివారం గనుక పనికి రాదేమో?" అన్నారు.

గురువుగారు లెంపలు వేసుకుని ఆముద్దను కళ్లకు అద్దుకుని తీసుకున్నారు. ఆ విధంగా గురువుగారి శనివార నియమానికి స్వస్తి జరిగింది.

'నిస్త్రైగుణ్యేపథి విచరతాంకో విధిః కోనిషేధః?' అన్న సూక్తిని యీ సంఘటన ద్వారా శ్రీ బాబు గురువుగారి అనుభవంలోనికి తీసుకుని వచ్చారు. పదార్థ భావన లేకుండా ప్రసాదాన్ని ప్రసాదంగానే తీసుకోవాలని తేట తెల్లం చేశారు.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు గారు 4-4-14 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 74 సంవత్సరాలు. శ్రీ సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# గురువు - శిష్యుడు

- వారణాసి కాళీప్రసాద్ USA

శ్రీమాతాజీ అమెరికా వచ్చినప్పుడు మాట్లాడుతూ "ఈయన మా గురువుగారు అని చెప్పుకోవటం కాదు, గురువే 'వీడు నా శిష్యుడు' అని చెప్పుకోవాలి" అన్నారు.

అది అప్పటికి అర్థం అయినట్లు అనిపించినా, యింకా ఆలోచించగా 'గురువును అనుసరిస్తున్న శిష్యుడే గురువు గురించి చెప్పుకోవాలి కదా! మరి అమ్మ ఏమిటి యిలా అన్నారు' అనే సందేహం నాలో మిగిలిపోయింది. పోనీ గురువు గురించి చెప్పకూడదు అన్న దానికీ, 'గురుం న వదేత్' అన్నదానికీ సరిపెడదామనుకున్నా, అసలు ఆ రెండిటికీ సంబంధం లేదు. వారు చెప్పిన విషయం అదికాదు అనిపించింది.

అయితే మా యింట్లో జరిగిన సత్సంగంలో శ్రీమాతాజీ మాట్లాడుతూ "గురువు నుండి శిష్యుడికి సమాధానం కేవలం ముఖతఃనే అక్కర్లేదు. ఆ తపన ఉంటే అది ఏ రూపంలో అయినా అది అందవచ్చు అని శెలవిచ్చారు.

నా విషయంలో అదే నిజమైందా అన్నట్లు ఒకసారి నెట్‌లో చూస్తుంటే శిష్యుడికి నిర్వచనం కనిపించింది. 'శాసితుం యితి యోగ్యః శిష్యా' అని. అంటే గురువు చేత శాసించబడగల యోగ్యతను పొందిన వాడే 'నిజమైన శిష్యుడు' అనిపించుకుంటాడని, కేవలం గురువును అనుసరించినంత మాత్రాన శిష్యుడనిపించుకోడని అవగతం అయింది. ఆయన శాసించడానికి అర్హుడు అయినరోజున గురువు ప్రేమతో 'వీడు నా శిష్యుడు' లేదా 'వీడు నా వాడు' అని పిలుస్తారని అర్థం అయింది. నా సందేహాన్ని మాతాజీ ఆవిధంగా నివృత్తి చేశారని నాకు అనిపించింది.

అయితే ఆశ్చర్యకరంగా 2-4-14 ఉదయం (లైవ్ టెలికాస్ట్‌లో) బోధలో మాతాజీ తిరిగి అదే విషయాన్ని ప్రస్తావిస్తూ, గురువు సమాధానాన్ని ఏరకంగానైనా - న్యూస్‌పేపర్‌లోని విషయం ద్వారానైనా - ఇవ్వవచ్చు అనడటంతో వారు సరిగ్గా నా అనుభవాన్ని వివరిస్తున్నట్లే అని నాకు అనిపించింది. వారు ఆ విషయాన్ని ప్రస్తావించటం, నేను ఆ సమయంలో దానిని వినడం కాకతాళీయం కాదని, వారి ప్రేమకు నిదర్శనమని అనిపించింది. శ్రీబాబూజీ, శ్రీ మాతాజీల ఆశీస్సులతో నేను కూడా అలాంటి యోగ్యతకే పాత్రుడనవ్వాలని ఆశిస్తూ......

(గతసంచిక తరువాయి) 

-రమణ ప్రసాద్

# 7. రోహిదాసు

రోహిదాస్ ప్రతి ఏకాదశికి పండరికి వెళ్ళి పాండురంగని దర్శనం చేసుకునేవాడు. అక్కడ చెప్పులు కుట్టేవాడు. ఒకసారి ఆదేశపు రాజు యుద్ధానికి బయటకు వెళ్ళాల్సి వచ్చింది. సైనికులందరికి పాదరక్షలు కావాల్సివచ్చాయి. నగరంలోని చెప్పలు కుట్టే ప్రతి ఒక్కడూ ఒక వారంలో 1000 పాదరక్షలు చేసి అప్పగించాలని ఆదేశించావు చెప్పలు కుట్టే వారందరూ సంతోషంతో మనుషులను పెట్టుకుని ఆపని చేయటంలో నిమగ్నమై ఉన్నారు రోహిదాన్ ఎప్పుడూ భగవద్ధ్యానంలో ఉంటూ ఈ పని మీద దృష్టి పెట్టలేక పోయాడు. ఎవరినైనా ఈ పని చేయటానికి పెట్టుకుందా మంటే ఎవ్వరూ దొరకలేదు. అనుకొన్న గడువులో చేసి ఇవ్వక పోతే రాజు గారు



కఠిన శిక్ష విధిస్తాడు. రోహిదాస్ భగవద్ధ్యానంలో సమయం గడుపుతున్నాడు ఒక నాటి సాయంత్రం ఒక కుర్రవాడు వచ్చి నీకు చెప్పలు కుట్టేవాడు కావాలన్నారు కదా నేను మీకు పని చేసి పెట్టగలను" అన్నాడు. రోహిదాస్ "నీ పేరేమిటి?" అంటే "రంగడు" లని చెప్పాడు. "మనం 1000 చెయ్య లేకపోయినా ఎన్ని వీలైతే అన్ని చేద్దాం" అన్నాడు రోహిదాస్ రంగడితో. మీరు కంగారు పడకండి నేను అనుకొన్న టైమ్‌కి 1000 చేసి అందిస్తాను మీరు రోజూ సంకీర్తన చేయండి నేను చక చకా పాదరక్షలు చేస్తాను" అన్నాడు.

రోహిదాస్ పాడుతూ ఉంటే రంగడు పాదరక్షలు చేసేవాడు. తెల్లవారే సరికి 1000 పాదరక్షలు చేసేశాడు. "రాత్రి అంతా మేలుకొని ఉన్నాం కదా తలకి నూనె అంటుకుని స్నానం చేసి వస్తానన్నాడు. నువ్వుకూడా స్నానం చేసి భోజనం చెయ్యి. నీకు ఇవ్వాల్సిన సొమ్ము ఇస్తాను." అన్నాడు దోహిదాస్ చేసిన పాదరక్షలు ఎంతో బాగున్నాయి అని మెచ్చుకున్నారు. రోహిదాస్‌కి ఇవ్వాల్సిన ధనం ఇచ్చారు. రంగడికోసం వెతికితే రంగడు కనిపించలేదు.

అక్కడ అందరినీ అడిగాడు. ఎవరూ చూడలేదని చెప్పారు. ఆ వచ్చినది పాండురంగడే అని గ్రహించాడు. రోహిదాస్‌ను రైదాస్ అని కూడా పిలుస్తారు.

ఒక సాధువు వచ్చి పరశువేది. అతనికి ఇచ్చి "ఇది ఇనుమును బంగారంగా చేస్తుంది దానిని ఉపయోగిచుకుని నీ అవసరాలు తీర్చుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు. కొన్ని నెలలు గడిచాక ఆ సాధువు మళ్ళీ వచ్చి "ఈ పరశువేది ఎక్కడ?" అని అడిగితే అది మీరు ఎక్కడ పెట్టారో అక్కడే వుంది." అన్నాడు రోహిదాస్. ఉన్న దానితో తృప్తిగా జీవనం గడిపాడు రోహిదాస్. అతను ప్రజలను భక్తి మార్గంలో పెట్టడానికి ఆధ్మాతిక ప్రసంగాలు వాడ వాడలకు వెళ్ళి చేసేవాడు ఆధ్యాత్మికోన్నతికి కులం అడ్డురాదు అని ప్రభోధించేవాడు.

రోహిదాస్ ప్రజలను భక్తిమార్గంలో నడిపేవాడు. ప్రాపంచిక విషయాలు దు:ఖదాయకమైనవి జన్మకు రావటమే దు:ఖదాయకమని, జన్మల పరంపర నుండి విముక్తి పొందాలంటే భగవత్కృప కలగాలి అని. భగవత్కృప భగవంతుని నామాన్ని స్మరించటం వల్ల వస్తుందని చెప్పేవాడు. ప్రజలారా ముకుందుణ్ణి స్మరించండి ఆయన తల్లీ తండ్రి మన సర్వస్వమూ. జీవితాంతం ముకుందుణ్ణి స్మరించండి.

ఆయన ఈ విధంగా రాముణ్ణి ప్రార్థించేవాడు. "ఓ రామా! నీకు నేను ఏమి సమర్పించ గలను? పువ్వులను సమర్పిద్దామా అంటే వాటిని తుమ్మెదలు ఎంగిలిచేశాయి. పాలు సమర్పిద్దామా అంటే దూడలు ఆవుల పొదుగులను ఎంగిలిచేశాయి. పోనీ నీరు సమర్పిద్దామా అంటే చేపలు కలుషితం చేశాయి. నీకు ఏమి సమర్పించాలో నాకు తెలియటం లేదు నీవే నాకు రక్ష".

పరమ భాగవతోత్తముడైన రైదాసు తన శేష జీవితాన్ని నిత్య సమారాధనతో, నిరంతర జప సంకీర్తనాదులతో చరితార్థం చేసుకొని తన ఆదర్శ నీయమైన జీవితం ద్వారా. అద్భుత చరితాత్ముడుగా భక్తుల హృదయాల్లో స్థిరంగా నిలిచి పోయాడు. తన జీవితమంతా భగవదారాధన లో గడిపి అంతిమ సమయంలో భగవన్నామాన్ని గానం చేస్తూ అనంత చైతన్యంలో లీనమైనారు.

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL